



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 354 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 27 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :354 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 27 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి..

### జగన్‌పై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సంచలన వ్యాఖ్యలు



- ముంతాజ్ హెూటల్ కు భూముల విషయంలో జగన్ బెదిరించారన్న బీఆర్ నాయుడు
- టీటీడీని వైసీపీ నేతలు దోచుకున్నారని ఆరోపణ
- భూమనను తిరుపతి నుంచి తరిమికొట్టాలని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత జగన్ పై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సంచలన ఆరోపణలు చేశారు. ముంతాజ్ హెూటల్‌కు భూముల విషయంలో అజయ్ అనే వ్యక్తికి జగనే స్వయంగా పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకి పెట్టి బెదిరించారని ఆయన ధ్వజమెత్తారు. తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ముంతాజ్ హెూటల్ వ్యవహారంపై మాట్లాడుతూ, తిరుమల ఏడుకొండలను ఆనుకొని ఉన్న పవిత్రమైన ప్రాంతాన్ని ముంతాజ్ హెూటల్‌కు కేటాయించడం గత వైసీపీ ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదమని విమర్శించారు. కోట్లాది రూపాయల టీటీడీ నిధులను వైసీపీ నేతలు మింగేశారని ఆరోపించారు. తమ బోర్డు అధికారంలోకి వచ్చాక అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేకుండా పనిచేస్తోందని, టీటీడీ పవిత్రతను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.ముంతాజ్ హెూటల్ వివాదాన్ని పరిష్కరించడంలో సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషించారని బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా హెూటల్ నిర్మాణం సరికాదని చంద్రబాబు చెప్పారని, హెూటల్ యాజమాన్యంతో మాట్లాడి వారికి మరోచోట

వివరాలు 2లో..



# రొటీన్ సమావేశాలు వద్దు.. ప్రజల కోసం పనిచేయండి

## బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



- బ్యాంకర్ల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి
- సీజన్ చివర్లో రైతులకు రుణాలిస్తే ఏం ప్రయోజనమని ప్రశ్న
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని హితవు

**పెన్ పవర్ డెస్క్:**కేవలం సమావేశాలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండద ని... బ్యాంకులు తమ నిర్ణయాలను ప్రజలు, రైతులు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా తీసుకోవాలని ముఖ్య మంత్రి చంద్రబాబు సూచించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో మా ట్లాడుతూ, బ్యాంకర్లు తమ పనితీరును మార్చుకోవాల్సిన సమయం ఆసన్న మైందని ఆయన అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే సగం కాలం గడిచి పోయిందని, ఈ సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకులు సీజన్ చివరిలో రుణాలు మంజూరు చేస్తే ప్రయోజనం ఉండదని చంద్రబాబు అన్నారు. "రైతులకు అవసరమైనప్పుడు రుణాలు, ఇతర ఇన్‌పుట్‌లు అందించాలి. కాలం దాటిపోయాక ఇచ్చే రుణాలతో వారికి ఉపయోగం శూన్యం" అని ఆయన చెప్పారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకులు కూడా కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని, నూతన సంస్కరణలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థ అమెరికా, చైనా వంటి దేశాలకు సవాలు విసిరేలా ఎదుగుతోందని, ఈ అభివృద్ధిలో బ్యాంకులు,

వివరాలు 2లో..

## పేర్ని నానిపై కేసు నమోదు

- ఏలూరు త్రీటౌన్ పీఎస్ లో కేసు నమోదు
- పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని
- పేర్ని నాని వ్యాఖ్యలను ఖండించిన నూజివీడు డీఎస్పీ



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, దెందులూరు నియోజకవర్గంలో విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం వంటి ఘటనలకు సంబంధించి కేసు నమోదు చేశారు. మరోవైపు పోలీసులపై పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను నూజివీడు డీఎస్పీ ఖండించారు.

## ఆ ఐఏఎస్ అధికారిణి వేల కోట్లు లూటీ చేశారు.. అవినీతిలో అనకొండ

### భూమన సంచలన వ్యాఖ్యలు



- ఆమె రోజుకు రూ. 1.5 లక్షల విలువైన చీర కడతారని ఆరోపణ
- తనపై కక్షగట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- టీడీఆర్ బాండ్ల ద్వారా భారీగా దోచుకోవాలని ప్రణాళిక వేశారని ఆరోపణ

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ సీనియర్ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిణిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆమెను 'అవినీతిలో అనకొండ' అంటూ అభివర్ణించిన ఆయన, టీడీఆర్ బాండ్ల విషయంలో ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. గత రెండేళ్లుగా తన మనసులో ఉన్న అభిప్రాయాన్ని ఇప్పుడు బయటపెడుతున్నానని భూమన స్పష్టం చేశారు.

వివరాలు 2లో..



### సెలవు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు. నేడు(బుధవారం) వినాయక చవితి సందర్భంగా పెన్ పవర్ కార్యాలయానికి సెలవు కావున పత్రిక పునర్దర్శనం 29.08.2025

## వ్యాపారుల నుంచి వ్యతిరేకత... ఏపీలో బార్ల టెండర్లకు గడువు పెంపు



- కొత్త పాలసీపై వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు టెండర్ల ప్రక్రియ
- గడువు ముగిసినా ఆశించిన స్థాయిలో రాని దరఖాస్తులు

వివరాలు 2లో..

## కలెక్టరేట్ నిర్మాణానికి నా స్థలం, సగం నిధులు..

### రఘురామకృష్ణరాజు కీలక ప్రకటన!



- పశ్చిమగోదావరి కలెక్టరేట్‌పై ప్రతిష్టంభనకు తెర
- రూ. 70 కోట్ల నిర్మాణ వ్యయంలో సగం తాను భరిస్తానన్న రఘురామ
- శంకుస్థాపనకు రావాలని సీఎం చంద్రబాబును కోరానని వెల్లడి

వివరాలు 2లో..

## కూటమి ప్రభుత్వానికి మానవత్వం లేదు

- దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు ఆరోపణలు
- కూటమి సర్కారుపై షర్మిల విమర్శలు
- రీ-వెరిఫికేషన్ పేరుతో అర్హులను వేధిస్తున్నారని ఆరోపణ
- బోగస్ పెన్షన్ల ఏరివేతను స్వాగతిస్తున్నామన్న షర్మిల
- అనర్హుల జాబితాను మరోసారి పరిశీలించాలని ప్రభుత్వానికి డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**దివ్యాంగుల పెన్షన్ల రీ-వెరిఫికేషన్ పేరుతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను వేధిస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శిం చారు. అనర్హులను ఏరివేసే నెపంతో, అర్హులైన దివ్యాంగు ల పింఛన్లను సైతం తొలగించి వారి పొట్టకొట్టాలని చూడటం దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి దివ్యాంగుల పట్ల మానవత్వం లేదంటూ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ,

వివరాలు 2లో..



## ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

### పాకిస్థాన్‌కు సీడీఎస్ పరోక్ష హెచ్చరిక

- ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేసిన సీడీఎస్
- శాంతిని కోరుకోవడాన్ని బలహీనతగా చూడొద్దని పరోక్ష హెచ్చరిక
- శక్తి లేని శాంతి కేవలం ఒక ఊహ మాత్రమేనని వ్యాఖ్య
- భవిష్యత్ యుద్ధాల స్వరూపాన్ని నిర్దేశించే నాలుగు కీలక అంశాల ప్రస్తావన
- వికసిత భారత్ కోసం ఆత్మనిర్భరత అవసరమని ఉద్ఘాటన
- ఆర్మీ వార్ కాలేజీలో 'రణ్ సంవాద్' సదస్సులో ప్రసంగం

వివరాలు 2లో..



## తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు



- నేడు వినాయక చవితి
- కుటుంబ ప్రగతికి విఘ్నాలు తొలగాలని చంద్రబాబు ఆకాంక్ష
- లక్ష్య సాధనలో ఎలాంటి ఆటంకాలు రాకూడదని వ్యాఖ్య
- భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న ప్రజలకు శుభాలు కలగాలి
- గణనాథుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థన

వివరాలు 2లో..



## క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం.. ఇక మనమే గ్లోబల్ హబ్

- అహ్మదాబాద్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తికి శ్రీకారం
- 100 దేశాలకు 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులు ప్రారంభం
- క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో భారత్ ప్రపంచ హబ్‌గా మారుతుందన్న ప్రధాని
- భారత్‌లో బ్యాటరీల తయారీ కోసం మూడు జపాన్ కంపెనీల భాగస్వామ్యం
- పెట్టుబడుల కోసం రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని మోదీ పిలుపు
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలపై ఇకపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్న ప్రధాని

**పెన్ పవర్ డెస్క్:**ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) త యారీ, ఎగుమ తుల రంగంలో భారత్ సరిక ొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈ వీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల రోడ్లపై పరుగులు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పవన్ పార్టీ ఎదగడానికి ఎంతదూరం?

ఆంధ్రప్రదేశ్ లో జనసేన పార్టీ కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024 ఎన్నికల పరిస్థితులు వేరు. 2029లో జరగబోయే పరిస్థితులు వేరుగా ఉంటాయి. ఎందుకంటే 2024కు ముందు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నడూ అధికారంలో ఉండలేదు. అదే సమయంలో ఆయనపై జనంలో కూడా బాగా హెూప్స్ ఉన్నాయి. పవన్ కల్యాణ్ నీతి మంతుడు. నిజాయితీ పరుడు. రాజకీయాల్లో అవినీతి చేసి డబ్బులు సంపాదించాల్సిన అవసరం లేదు. ఇప్పటికీ అదే నిజం. ఎందుకంటే ఆయన సినిమాల ద్వారానే తన ఆదాయాన్ని సంపాదించుకుంటారు. ఒక్క సినిమా చేస్తే చాలు పార్టీని ఏడాది పాటు నడపటానికి అవసరమైన డబ్బులు సమకూరుతాయి.

**ఇతర నేతలకు భిన్నంగా...**

అందులో పవన్ కల్యాణ్ కు, రాజకీయ నేతలకు మధ్య చాలా తేడా ఉంది. ఏదో చేయాలని మాత్రమే రాజకీయాల్లోకి వచ్చారు. వారసత్వంగానో లేక రాజకీయాల్లో పదవులు సంపాదించుకుని సొమ్ములు మూటగట్టుకుందామన్న ధ్యాస కూడా లేదు. తాను ఫీలయితే సొంత డబ్బులు అయినా ఇచ్చి ఆ సమస్యకు పరిష్కారం చూపడంలో ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ముందుంటారు. అటువంటి పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో కీలకంగా మారారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా జోడీ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో పరుగులు పెట్టిస్తుందని ఆశించారు. అయితే అనేక కారణాలు ఆయన కాళ్లకు బ్రేకులు వేశాయనే చెప్పాలి.

**పథ్నాలుగు నెలల నుంచి...**

ఎందుకంటే గత పథ్నాలుగు నెలల నుంచి పవన్ కల్యాణ్ తనకు బాధ్యత అప్పటించిన మంత్రిత్వ శాఖలో విజయం సాధించినప్పటికీ, ఉప ముఖ్యమంత్రిగా మాత్రం ఆశించిన రీతిలో పనితీరు లేదన్నది ప్రజాభిప్రాయంగా వినిపిస్తుంది. ఏ విషయంలోనూ కూటమి ప్రభుత్వంలో తీసుకుంటున్న నిర్ణయాలు తప్పని చెప్పే పనికి దూరంగా ఉంటుండటంతో కొంత పవన్ ఇమేజ్ రాజకీయంగా డ్యామేజీ అయిందనే చెప్పాలి. అయితే పవన్ కల్యాణ్ అంటే నేటికీ అభిమానమున్న జిల్లాలు కొన్ని మాత్రమే మిగిలి ఉన్నాయి. అక్కడ కూడా 2024 ఎన్నికల కంటే ముందున్న పరిస్థితులకు భిన్నంగా మారాయి. అయినా రెండు జిల్లాల్లోనే నేటికీ పవన్ కల్యాణ్ పార్టీ బలంగా ఉండటంతో మిగిలిన జిల్లాల్లో బలహీనంగా ఇప్పటికీ కొనసాగుతుండటంతో రానున్న ఎన్నికల నాటికి పవన్ రంగంలోకి దిగి మార్చకపోతే మరింత దిగజారే అవకాశాలున్నాయన్నది సుస్పష్టం.

# కలెక్టరేట్ నిర్మాణానికి నా స్థలం, సగం నిధులు..

నూతన పశ్చిమగోదావరి జిల్లా సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి సంబంధించి నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించుతూ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కీలక ప్రకటన చేశారు. కలెక్టరేట్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తానే సమకూర్చడంతో పాటు, నిర్మాణ ఖర్చులో సగం భరిస్తానని ఆయన ముందుకొచ్చారు. ఈరోజు జిల్లాలో పర్యటించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

కొత్త జిల్లా ఏర్పడిన నాటి నుంచి కలెక్టరేట్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోందని రఘురామ గుర్తుచేశారు. గతంలో మార్కెట్ యార్డులో స్థలం కేటాయించినా, ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, కలెక్టరేట్ నిర్మాణ బాధ్యతలో తాను పాలుపంచుకుంటున్నట్లు ప్రకటించారు. కలెక్టరేట్ భవనాన్ని సుమారు రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని భావిస్తున్నట్లు రఘురామ తెలిపారు. దీనికి మొత్తం రూ.70 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా, అందులో రూ.35 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, మిగిలిన రూ.35 కోట్లను తానే సమకూరుస్తానని హామీ ఇచ్చారు. “స్థలం నేను ఇచ్చాను, సగం డబ్బు కూడా ఇస్తానని మాట ఇచ్చాను” అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై కొందరు సంకుచిత స్వభావంతో మాట్లాడుతున్నారని, మండలి ఛైర్మన్ దీనిని ఇరిగేషన్ భూమి అన్నారని రఘురామ ప్రస్తావించారు. తాను భీమవరం, ఉండి అని వేరుగా చూడటం లేదని, జిల్లా అంతా ఒకే యూనిట్‌గా భావిస్తున్నానని స్పష్టం చేశారు. పెద అమిరం గ్రామాన్ని భీమవరం మున్సిపాలిటీలో కలపడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ బృహత్ కార్యక్రమానికి త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబును తాను స్వయంగా కోరినట్లు రఘురామకృష్ణరాజు వెల్లడించారు.

# వ్యాపారుల నుంచి వ్యతిరేకత... ఏపీలో బార్ల టెండర్లకు గడువు పెంపు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన కొత్త బార్ పాలసీకి మొదటి అడుగులోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు టెండర్లు ఆహ్వానించగా, మద్యం వ్యాపారుల నుంచి ఊహించని విధంగా నిరసన వ్యక్తమవడంతో దరఖాస్తులు దాదాపుగా రాలేదు. దీంతో కంగుతిన్న ఎక్సైజ్ శాఖ అధికారులు, టెండర్ల గడువును పొడిగించక తప్పలేదు.

వాస్తవానికి, బార్ అండ్ రెస్టారెంట్ల టెండర్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఈరోజు సాయంత్రంతో గడువు ముగిసింది. అయితే, కొత్త పాలసీలో నిబంధనలు ఆచరణ సాధ్యంగా లేవని, లోపభూయిష్టంగా ఉన్నాయని మద్యం వ్యాపారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ దరఖాస్తులు చేయకూడదని వారు ముందుగానే నిర్ణయించుకున్నారు. పాలసీలో కీలక మార్పులు చేసే వరకు తాము టెండర్ల ప్రక్రియలో పాల్గొనబోమని స్పష్టం చేస్తున్నారు. వ్యాపారుల నుంచి స్పందన కరవవడంతో, ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలకు దిగింది. దరఖాస్తుల స్వీకరణకు తుది గడువును ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే, గడువు పొడిగించినంత మాత్రాన తాము దరఖాస్తులు చేసేది లేదని, ముందుగా పాలసీని సవరించాల్సిందేనని వ్యాపారులు పట్టుబడుతున్నారు. దీంతో ఈ వ్యవహారం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది.

# తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

నేడు వినాయక చవితి (ఆగస్టు 27) పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ శుభ సందర్భంగా చంద్రబాబు తన సందేశాన్ని వెలువరిస్తూ, ప్రజలు నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ఆ గణనాథుడు అందరినీ అనుగ్రహించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా మండపాలను ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య గణేశుడిని పూజిస్తున్న భక్తులకు సకల శుభాలు కలగాలని ఆ వినాయకుడిని ప్రార్థిస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. ఈ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలను నింపాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆ ఐఏఎస్ అధికారిణి వేల కోట్లు లూటీ చేశారు.. అవినీతిలో అనకొండ

- మొదటి పేజీ తరువాయి

తిరుపతిలో భూమన మాట్లాడుతూ.. గతంలో పనిచేసిన సదరు ఐఏఎస్ అధికారిణికి డబ్బు సంపాదించాలనే ధ్యాస తప్ప నైతిక విలువలు లేవని ఆరోపించారు. ఆమె శాఖకు సంబంధించిన మంత్రులను సైతం ఆమె కనీసం లెక్కచేయలేదని, కిందిస్థాయి అధికారుల పట్ల ‘తాటకి’లా వ్యవహరించారని తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్లు వేస్తున్న సమయంలో, టీడీఆర్ బాండ్ల ద్వారా భారీగా దోచుకోవాలని ఆమె ప్రణాళిక వేశారని, అయితే తాము దానిని అడ్డుకున్నామని భూమన వివరించారు. ఈ విషయం తట్టుకోలేకే, సదరు అధికారిణి నెల్లూరు జిల్లా నేతలకు తప్పుడు సమాచారం అందించి, తాను రూ.2,000 కోట్లు దోచుకున్నానంటూ అబద్ధపు ప్రచారం చేయించారని భూమన ఆరోపించారు. తాను ఒక్క రూపాయి అవినీతికి పాల్పడినట్టు నిరూపించినా ఎలాంటి శిక్షకైనా సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. “ఆమె 35 ఏళ్ల సర్వీసులో ఎక్కడ పనిచేసినా వందల, వేల కోట్లు లూటీ చేశారు. ఆమె అవినీతి గురించి సుప్రీంకోర్టుకు కూడా తెలుసు” అని భూమన వ్యాఖ్యానించారు.

సదరు ఐఏఎస్ అధికారిణి రోజూ ధరించే చీర ఖరీదు రూ.1.5 లక్షలు ఉంటుందని, వేల రూపాయల విలువ చేసే 11 విగ్గులు ఆమె వద్ద ఉన్నాయని భూమన వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నీతిగా, నిజాయతీగా ఉన్న తనపై కక్షగట్టి, కుట్రపూరితంగా అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము 21 మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసి తిరుపతిని అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి గుర్తుచేశారు. వైసీపీ హయాంలో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన శ్రీలక్ష్మిని లక్ష్యంగా చేసుకుని భూమన ఈ వ్యాఖ్యలు చేసినట్టు భావిస్తున్నారు.

# కూటమి ప్రభుత్వానికి మానవత్వం లేదు

- మొదటి పేజీ తరువాయి

“బోగస్ పెన్షన్లను గుర్తించి, దొంగ సర్టిఫికెట్లతో లబ్ధి పొందుతున్న వారిని ఏరివేయడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుంది. అలాంటి సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. కానీ, ఆ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి. రీ-వెరిఫికేషన్ పేరుతో ఏళ్ల తరబడి పెన్షన్ మీద ఆధారపడి జీవిస్తున్న నిజమైన వికలాంగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు” అని అన్నారు. ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన 1.20 లక్షల మందిలో అత్యధికులు అర్హులే ఉన్నారని తమకు సమాచారం అందిందని షర్మిల పేర్కొన్నారు. ప్రభుత్వం రూపొందించిన అనర్హుల జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె డిమాండ్ చేశారు. “వికలాంగుల జీవితాలతో రాజకీయాలు చేయడం తగదు. ప్రభుత్వం వారి పట్ల మానవత్వంతో వ్యవహరించాలి. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది” అని ఆమె హితవు పలికారు.

ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే జోక్యం చేసుకోవాలని షర్మిల కోరారు. అర్హులుగా తేలిన వారి పెన్షన్లను వెంటనే పునరుద్ధరించి, వారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమె డిమాండ్ చేశారు.

## క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం..

# ఇక మనమే గ్లోబల్ హబ్

- మొదటి పేజీ తరువాయి

పెట్టను న్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించడం విశేషం.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. “గతంలో ఈవీలకు అత్యంత కీలకమైన బ్యాటరీలను మనం పూర్తిగా దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. మూడు ప్రముఖ జపాన్ కంపెనీలు కలిసి భారత్‌లోనే బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రోడ్‌లను తయారు చేస్తున్నాయి. ఇది మన దేశ హైబ్రిడ్ వాహనాల మార్కెట్‌కు కొత్త ఊపునిస్తుంది” అని ఆయన వివరించారు. భారత్-జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. “సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది” అని మోదీ వ్యాఖ్యానించారు.

గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, ‘మేక్ ఇన్ ఇండియా’ వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. “వ్యాపార అనుకూల వాతావరణం, లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో పెట్టుబడులకు అనువైన మార్గాలను సృష్టించాం. ఫలితంగా పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగింది” అని అన్నారు.

భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, “మేం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి.

అదేవిధంగా కీలక ఖనిజాల కోసం ‘నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్’ను ప్రారంభించాం” అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## రొటీన్ సమావేశాలు వద్దు..

# ప్రజల కోసం పనిచేయండి

- మొదటి పేజీ తరువాయి

ఆర్థిక సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. సంపద సృష్టితో పాటు పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. 2047 నాటికి భారత్‌ను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాలన్న లక్ష్యంలో భాగంగా బ్యాంకులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, గ్రామీణ బ్యాంకింగ్ సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు గానూ రూ.1,80,540 కోట్ల రుణ లక్ష్యం కాగా, జూన్ నాటికి రూ.94,666 కోట్లు మంజూరు చేసినట్లు బ్యాంకర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.5,937 కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. వీటితో పాటు విద్యా రంగానికి రూ.252 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.1,146 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

“ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు, అది ఇప్పటికీ కొనసాగుతోంది” అని త్రివిధ దళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీ వార్ కాలేజీలో మంగళవారం ప్రారంభమైన ‘రణ్ సంవాద్’ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు.

ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, “భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్ళం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు” అని అన్నారు. గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. “రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు, ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి” అని ఆయన తెలిపారు. ‘వికసిత భారత్’ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం ‘సశస్త్ర’, ‘సురక్షిత్’, ‘ఆత్మనిర్భర్’గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ ‘రణ్ సంవాద్’ సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించనున్నారు.

# పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి..

- మొదటి పేజీ తరువాయి

25 ఎకరాల స్థలం తీసుకునేలా ఒప్పించారని వివరించారు. టీటీడీ భూములను ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారని కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ అంశంపై సీబీఐ విచారణ జరిపించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేయడాన్ని ఆయన హాస్యాస్పదంగా అభివర్ణించారు. డబ్బు వెదజల్లి అందరినీ కొనడం వారికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఇదే క్రమంలో, మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిపై కూడా నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో నివసించే అర్హత భూమనకు లేదని, ఆయన్ను తిరుపతి నుంచి తరిమికొట్టాలని అన్నారు.

# వైసీపీ అధినేత జగన్‌ను కలిసిన ముద్రగడ గిరిబాబు



**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 26 :**వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మర్యాదపూర్వకంగా తాడేపల్లిలో కలిశారు. ఈ సమావేశంలో జగన్ మోహన్ రెడ్డి, గిరిబాబు తండ్రి, సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. పద్మనాభం త్వరగా కోలుకొని ప్రజా క్షేత్రంలో మళ్లీ చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. "పార్టీ బలోపేతం కోసం మీరు గ్రామ స్థాయికి వెళ్లి కష్టపడాలి. ప్రజల సమస్యలు వినండి, పరిష్కార మార్గాలు చూపండి. ఆ పని జరిగితే ప్రత్తిపాడులో వైసీపీ మరింత బలపడుతుంది" అని జగన్ సూచించారు. గిరిబాబు మాట్లాడుతూ "మా తండ్రి ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, మా కుటుంబం పట్ల చూపుతున్న మమకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. పార్టీ పట్ల మీ ఆదేశాలను అనుసరిస్తూ, ప్రజల్లో కలిసిపోతూ, ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసీపీని బలోపేతం చేయడానికి నా శక్తిమేరకు కృషి చేస్తాను" అని తెలిపారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం



● కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం,పెన్ పవర్ ఆగస్టు 26:** మంగళవారం నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లా డివిజన్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ప్రభావం వల్ల జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం జిల్లా డివిజన్, మండల అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని వరదల్ని ఎదుర్కోవడానికి సమా యత్తం కావాలని అధికారులును ఆదేశించారు. ప్రత్యేకంగా ఐ పోలవరం, కాట్రేనికోనం, మామిడి కుదురు, ముమ్మిడివరంలో ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.కొత్తపేట రామచంద్రపురం లో కూడా అన్ని ముంపు ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.టెలి కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ. నిశాంతి తో పాటు జిల్లా రెవెన్యూ డివిజన్ అధికారులు, నోడల్, సంబంధిత జిల్లా అధికారులంతా పాల్గొ న్నారు. జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ : 08856 -2931 04. కొత్తపేట కంట్రోల్ రూమ్ నెంబర్: 8500 238258. రామచంద్రపురం కంట్రోల్ రూమ్ నెంబర్ : 08857 -245166 నెంబర్లకు తెలియజేయాలని పేర్కొన్నారు.

## ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సర్వేలో సానుకూల

# స్పందన అవసరం - కలెక్టర్ షణ్మోహన్






**కాకినాడ,ఆగస్టు 26 పెన్ పవర్:**ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సర్వేలో జిల్లా నుండి లబ్ధిదారులు సంతృప్తికరమైన అభిప్రాయాలు ఇవ్వడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మళ్లీ మొదటి స్థానాన్ని సాధించేం దకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.కాకినాడ స్మార్ట్ సిటీ మీటింగ్ హాల్‌లో మంగళవారం జరిగిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వర్క్‌షాప్కు కలెక్టర్ షణ్మోహన్, ట్రైనీ కలెక్టర్ మానీషా ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించేం దుకు ఏక గవాక్ష విధానంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, పరిశ్రమల ఏర్పాటులో ఎదురయ్యే సమస్యలను జిల్లా యంత్రాంగం వెంటనే పరిష్కరించేందుకు ముందుంటుందని భరోసా ఇచ్చారు.జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్. గణపతి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సర్వే గూర్చి శాఖల నోడల్ అధికారులకు, లబ్ధిదారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.తదుపరి కార్యక్రమంలో వినాయక చవితి వేడుకలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని అవ గాహన కల్పిస్తూ,జిల్లా కాలుష్య నియంత్రణ మండలి రూపొందించి న గోడపత్రికను కలెక్టర్ షణ్మోహన్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ. రమణా రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ నారాయణ మూర్తి, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ,ఎంహెచ్ఓ డా. పృథ్వీ చరణ్, ఇతర శాఖల అధికారులు, పరిశ్రమల శాఖ సిబ్బంది, అలాగే వివిధ అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.



# నాలుగేళ్లుగా కదలని పనులు

**ఏలూరు ఆగస్టు 26 పెన్ పవర్ :** సచివాలయ నిర్మాణం ఉత్సవ విగ్రహాన్ని తలపిస్తోంది. సచివాలయ భవన పూర్తి కాకపోవడంతో ఇరుకు గదిలోనే సచివాలయ కార్యకలాపాలు సిబ్బంది నిర్వహిస్తున్నారు.గత ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం వంగూరు సచివాలయ భావన నిర్మాణ పనులు గత నాలుగేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా మారింది. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఈ పనులు పూర్తి కాలేదు. బిల్లులు రాలేదని గుత్తేదారులు పనులు మధ్యలో ఆపేశారు. నాలుగేళ్లుగా ఈ సచివాలయం నిర్మాణం ఉత్సవ విగ్రహంగా దర్శనమిస్తోంది. మండలంలోని 10 సచివాలయాల నిర్మాణానికి స్థల సేకరణ

చేశారు. అన్నిచోట్ల స్థలాలు కేటాయించడంతో పనులు నాలుగేళ్ల క్రితం మొదలుపెట్టారు. ఒక బిల్లు కూడా రాకపోవడంతో గుత్తేదారులు పనులు మధ్యలోనే ఆపేశారు. అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేశారు. చేసిన ఖర్చులో కొంత మాత్రమే రావడంతో పనులు చేయడానికి ఆసక్తి చూపలేదు. నిర్మాణాలు ఆగిపోయాయి. వాటిని పూర్తి చేయించాలని ప్రజాప్రతినిధులు ఎన్నిసార్లు అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు జరగడం, ప్రభుత్వ మాడడంతో గుత్తేదారులలో ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వమైనా బిల్లులు చెల్లిస్తుందన్న ఆశతో వారంతా ఉన్నారు. పాలకుల ఆదేశాల మేరకు ఉత్తేదారులతో పనులు చేయించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నాలుగేళ్లుగా పూర్తికాని నిర్మాణం ఈ ఏ డాదైనా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

# గబ్బు కొడుతున్న నెల్లిపాక పంచాయతీ ప్రధాన రహదారీ...







**దుర్వాసన వెదజల్లుతున్న నెల్లిపాక ప్రధాన రహదారి...**

**మట్టి కుప్పలు ఎత్తండి మహాప్రభువు అంటున్న ప్రజానీకం...**

**ఎటపాక, పెన్ పవర్,ఆగస్టు26**

అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ ప్రధాన రహదారి గత నెల రోజులగా దుర్వాసనతో గబ్బు కొడుతుంది... ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ ఇటీవల కాలంలో పూర్తిగా మట్టితో కూడకపోయిన విషయం గ్రామస్తులందరికి తెలిసినది, ఆ డ్రైనేజీ మరమ్మత్తుల నిమిత్తం నెలల క్రితం పూడిక పనులు చేపట్టి డ్రైనేజ్ కాలువ శుభ్రం చేశారు, డ్రైనేజీ కాలువ నుంచి తీసిన మట్టిని అక్కడి నుంచి తొలగించకుండా ఉంచడంతో దుర్వాసన రావడం తద్వారా రోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ మట్టి కుప్పలు గత నెల రోజుల నుంచి గబ్బుకంపు కొడుతున్నాయి, ఎంతోమంది అధికారులు ప్రధాన రహదారిపై ఉన్న టిఫిన్ హొటల్లకు కిరాణా షాపులకు వచ్చిపోతూ ఉంటారు, ఈ వాసన తో అనేక రోగాలు వస్తాయని వెంటనే ఈ సమస్యను పరిష్కరించుకోండి అని అనేకమార్లు షాపుల వారికి చెప్పడం జరిగిందని అన్నారు, ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి ఈ గబ్బు కంపు కొడుతున్న మట్టి కుప్పలు ఎత్తండి, ఈ దుర్వాసనతో ప్రజల రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది,




# దాతల సేవలు అభినందనీయం

**కాజులూరు, ఆగస్టు 26 పెన్ పవర్:**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాజులూరు విద్యార్థుల కోసం మంచినీరు సులభంగా అందుబాటులో ఉండే విధంగా దాతలు ముందుకు వస్తున్నారని ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి తెలిపారు.విద్యార్థుల తరగతి గదుల వద్ద నీటి సౌకర్యం కల్పించాలని ప్రధానోపాధ్యాయులు కోరగా, యాళ్ళ రవికుమార్ స్పందించి దాదాపు రూ.10,000 విలువైన 16 కూలింగ్ వాటర్ టిన్స్‌ను పాఠశాలకు అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ %-% "ధనం అందరికీ ఉంటుంది, కానీ దానిని అవసర మైన చోట వినియోగించటం కొద్దిమందికే సాధ్యం అవుతుంది. అలాంటి వారిలో రవికుమార్ గారు ముందు వరుసలో నిలుస్తారు" అన్నారు. ఆయన స్ఫూర్తితో గ్రామ పెద్దలు, యువత పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు.పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు మాట్లాడుతూ విద్యార్థుల దాహం తీర్చేందుకు రవికుమార్ చేసిన సహాయం శుభపరిణామమని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణమూర్తి, స్టాఫ్ సెక్రటరీ కె. హరినాథ్, షేక్ వలీ భాషా, బుజ్జిబాబు, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి సందడి - గొల్లపాలెం మార్కెట్ కిక్కిరిసిన ప్రజలు





**కాజులూరు, ఆగస్టు 26 పెన్ పవర్:**వినాయక చవితి పర్వదినం సందర్భంగా కాజులూరు మండల పరిధిలోని గొల్లపాలెం మార్కెట్ సెంటర్ పండగ హర్షం,ఉత్సాహంతో కిక్కిరిసింది. మంగళవారం సాయంత్రం వేళ నుంచి వినాయక పాల పత్రాలు, మట్టి ప్రతిమలు, పూలు, పూలదండలు,వెలగ కాయలు,యాపిల్స్, బత్తాయిలు , అరటిపండ్లు,వంటి పూజా సామగ్రికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. హిందూ సాంప్రదాయ ప్రకారం వినాయక చవితి తొలి పండుగగా భావించడంతో ప్రతి ఇంటా సిద్ధతలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో గొల్లపాలెం మార్కెట్‌లో మహిళలు, ఉద్యోగులు, యువత, పెద్దలు ఇలా అన్ని వర్గాల వారు తరలివచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేయడంతో పండగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా గొల్లపాలెం ఎస్సై ఎం. మోహన్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి మార్కెట్‌కు విచ్చేసి వినాయకునికి ప్రీతిపాత్ర మైన పత్రులు, పూలు కొనుగోలు చేశారు. అనంతరం మార్కెట్ అంతా తిరిగి పౌరులను పలకరించారు.ప్రజలతో నిండిన గొల్లపాలెం మార్కెట్ సెంటర్‌లో వినాయక చవితి సందడి అందరికి పండగ ఆనందాన్ని కలిగించింది.మార్కెట్ ను సందర్శించిన వారిలో సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ,గొల్లపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులు నక్క శ్రీను,అంగర శ్రీను, వనమాడి శ్రీను,సాక్షి రెడ్డి,చందాల ఆదినారాయణ ,పాలిక వీరబాబు , లాంఢ్రీ కొండ,వీవోఏ సీతారామరాజు, గొల్లపాలెం పోలీస్ సిబ్బంది తదితరు లు ఉన్నారు.



# ధర్మవరం ప్రతిభ విద్యాలయంలో వినాయక చవితి వేడుకలు





- చిన్నారుల పూజలతో పండుగ వాతావరణం
- సాంప్రదాయ దుస్తుల్లో అలరించిన చిన్నారులు

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 25 :** మండలంలోని ధర్మవరం గ్రామంలోని శ్రీ ప్రతిభ విద్యాలయం ఆవరణలో గురువారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాలయం ప్రీ ప్రైమరీ చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని విజయానికి, జ్ఞానానికి అధిపతి అయిన గణేశ మహారాజుకు ప్రత్యేక పూజలు చేశారు. పిల్లల నినాదాలతో పండుగ వాతావరణం అలరారింది. ఈ సందర్భంగా విద్యాలయ అధినేత దాసం శేషారావు చిన్నారులకు శుభాకాంక్షలు తెలుపుతూ, "గణేశుని ఆరాధనతో పిల్లల్లో ఆధ్యాత్మికత పెరుగుతుంది. చిన్న వయసులోనే పూజల అలవాటు పెంచడం మంచి విషయం" అన్నారు. తల్లిదండ్రులు ప్రతిమలు, పూజా సామాగ్రి అందించి పిల్లలను పంపడం ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. చిన్నారుల పూజ అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ప్రీ ప్రైమరీ ఇంచార్జి సుజాత, ఉపాధ్యాయులు ఆషారాణి, బి. వరలక్ష్మి, ఎన్. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన ధ్యేయం

**మట్టి వినాయకులను పంపిణీ చేసిన రఘుదేవపురం గ్రామస్తులు**



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు 26:** పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఇందులో ముఖ్యంగా వినాయక చవితి కోసం వినియోగించే వినాయక ప్రతిమలను మట్టితో తయారుచేసినవాటిని పూజల్లో వినియోగించాలని సీతానగరం మండలంలో రఘుదేవపురం గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ కార్యక్రమం తలపెట్టినా విఘ్నేశ్వరుడికి తొలిత పూజలు చేయడం ఆనవాయితీ అని అలాంటి వినాయక చవితిని రాష్ట్రంలో దేశంలో పెద్ద ఎత్తున జరుపుకుంటూ ఉంటారని అన్నారు గతంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన విగ్రహాలు కారణంగా భూ కాలుష్యంతో పాటు వాయు జల కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. దీంతో ఎన్నో దుష్పరిణామాలు ఎదురవుతాయని చెప్పారు. మట్టి వినాయక విగ్రహాలు కారణంగా నిమజ్జనం సమయంలో సులువుగా నీటిలో కరిగి పర్యావరణాన్ని కాపాడగలిగే వాళ్ళం అవుతామని అన్నారు.

## శాంతిభద్రతలపై చర్చించిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 26 :** నియోజకవర్గంలో నీ ప్రజలు భద్రంగా నమ్మకంగా ఉండే విధంగా శాంతిభద్రతల పటిష్టంగా అమలు చేయాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పోలీసులకు సూచించారు .మంగళవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాంతిభద్రతలు, లా అండ్ ఆర్డర్ పై నియోజకవర్గ పోలీసుల తో చర్చించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలతో పోలీసులు సమన్వయం కలిగి ఉండాలని అన్నారు .యువత మత్తు పదార్థాలు వాడకాన్ని అరికట్టడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. జూదం, మద్యం అక్రమ రవాణా వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించారు. ప్రజలకు నమ్మకం కలిగే విధంగా ప్రతి ఫిర్యాదుని సమయానికి పరిష్కరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవరం డిఎస్పి ఎం వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి ,పోలవరం, కుకునూరు, సిఐలు బి వెంకటేశ్వరరావు, పి.బాల సురేష్ బాబు, రమేష్ బాబు, జీలుగుమిల్లి ఎస్సై వి క్రాంతి కుమార్ తో పాటు నియోజకవర్గం లో ఎస్ఐలు పాల్గొన్నారు.

# ధర్మవరంలో యూరియా కోసం ఎగబడిన రైతులు





- పోలీసుల పర్యవేక్షణలో పంపిణీ
- మండలంలో 300 మెట్రిక్ టన్నుల కొరత

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 26 :** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో మంగళవారం రైతులు యూరియా ఎరువుల కోసం బారులు తీరారు. ఉదయం నుంచే రైతులు రైతు సేవా కేంద్రం వద్ద చేరి, సరఫరా ఆలస్యమవుతుందేమోనన్న భయంతో ఎగబడుతూ హడావుడి చేశారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయవచ్చని భావించిన పోలీసులు అక్కడికి చేరుకుని పర్యవేక్షణ చేపట్టారు. వ్యవసాయ శాఖ ఏవో జోకా అమృత ఆధ్వర్యంలో అధికారులు 20 టన్నుల యూరియాను 278 మంది రైతులకు పంపిణీ చేశారు. ఇప్పటివరకు మండలంలో 300 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ పూర్తయిందని, కానీ రైతుల అవసరాలను బట్టి ఇంకా 300 మెట్రిక్ టన్నుల కొరత కొనసాగుతోందని ఆమె వివరించారు.



### రైతుల ఆందోళన

వర్షాలు సకాలంలో కురవడంతో పంటలు చిగురుమీద నిలిచాయి. ఈ దశలో యూరియా అందకపోతే పంటల పెరుగుదల దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "సీజన్‌లోనే ఎరువు ఇవ్వకపోతే తర్వాత ఇచ్చినా ప్రయోజనం ఉండదు. పంట మిగలదు" అని వారు అసహనం వ్యక్తం చేశారు. కొందరు రైతులు ప్రత్తిపాడు మండలం ఎప్పుడూ ఇలాంటి సమస్యలతోనే ఇబ్బందులు పడుతోందని, ప్రభుత్వానికి ముందుగానే అవసరాలు తెలియజేసినా సరఫరా లోపాలు తప్పడం లేదని మండిపడ్డారు. ప్రతి సీజన్‌లోనూ యూరియా కొరత సమస్య మరల మరల రావడం రైతుల్లో తీవ్ర అసహనానికి దారితీస్తోంది. పంటలు పెరిగే కీలక దశలో ఎరువుల సరఫరా విఫలమవ్వడం వల్ల రైతులు నష్టపోతున్నారని వారు వాపోతున్నారు. "ప్రభుత్వం కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, రైతు బారులు తీరే వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలి" అని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రత్తిపాడు మండలంలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా కూడా ప్రతి సీజన్‌లో యూరియా కొరత సమస్య తలెత్తుతోంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి సరఫరాలో ఆలస్యం, రాష్ట్రంలో రవాణా, పంపిణీ లోపాలు ఈ సమస్యను మరింత పెంచుతున్నాయి. వర్షాలు సకాలంలో కురవడం వల్ల పంటల విస్తీర్ణం పెరిగినప్పటికీ, ఎరువుల కేటాయింపులో పెరుగుదల ఉండకపోవడం రైతులకు పెద్ద దెబ్బ అవుతోంది. నిపుణుల విశ్లేషణ ప్రకారం, సకాలంలో ఎరువులు అందకపోతే దిగుబడి 20-30 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. ఇది నేరుగా రైతుల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇకపోతే ప్రభుత్వం వెంటనే అదనపు కోటా కేటాయించి, రవాణా వేగవంతం చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. రైతులు ఇప్పటికే రుణాల కింద కష్టాల్లో ఉండగా, యూరియా సమస్య పంటను నష్టపరిస్తే వారి ఆర్థిక పరిస్థితి మరింత దయనీయమవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



## అడ్డతీగలలో మదర్ థెరీసా 115 వ జయంతి ....



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్ట్ 25:** మదర్ థెరీసా 115వ జయంతి సందర్భంగా,అడ్డతీగల ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మదర్ థెరీసా విగ్రహానికి సంఘం సభ్యులు చోడిశెట్టి .సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మదర్ థెరీసా ఆశయ సాధన కృషి చేయాలని సేవాభావం కలిగి ఉండాలని సుబ్బారావు అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ పప్పుల .చిట్టెమ్మ హాజరయ్యారు.మదర్ థెరీసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ మదర్ థెరీసా మానవాళికి ఆదర్శం అని ప్రతి ఒక్కరు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని మదర్ థెరీసా సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.వెంకటేశ్వ రావు,ఆరోగ్యరాజ్, ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు జయరాం, సాయి, వెంకన్న, అప్పు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థను సక్రమంగా నడిపిందుకే స్మార్ట్ రేషన్ కార్డులు

- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం, పెన్ పవర్, ఆగస్టు 26 :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ప్రజల కోసం ఎన్నో పథకాలు తీసుకొస్తు ప్రజా సంక్షేమ కోసం కృషి చేస్తున్నదని మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్, దీపం పథకం, తల్లికి వందనం , అన్నదాత సుఖీభవ , స్త్రీ శక్తి వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.మంగళవారం మండలంలోని వెదురుపాక గ్రామ సచివాలయం వద్ద స్మార్ట్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో పగడ్బందీగా స్మార్ట్ రేషన్ రూపకల్పన చేసిందన్నారు.

ఇప్పటివరకు ఉన్న రేషన్ కార్డులో ఆ కుటుంబానికి చెందిన సభ్యులందరితో ఫోటో ఉండేదని, ఇప్పుడు ఆ స్థానంలో కుటుంబ యజమాని ఫోటో ఉంటుందని తెలియజేశారు.స్మార్ట్ కార్డులు బ్యాంక్ డెబిట్ కార్డు ,ఏటీఎం తరహా ఉంటుందన్నారు .స్మార్ట్ ఈబిపాస్ మిషన్లను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తేనున్నదని ,ఇప్పుడున్న స్మార్ట్ కార్డులను ఈ యంత్రం ద్వారా స్వైప్ చేస్తే వివరాలు వస్తాయన్నారు.దీనివల్ల గతంలో యంత్రాలతో వచ్చిన సర్వర్ సమస్యలు ఉండవని తెలియజేశారు.

సరుకులు తీసుకున్న వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి సమాచారం అందుతుందన్నారు.

లబ్ధిదారుడు క్యూఆర్ కోడ్ స్కానింగ్ తో సరుకులు తీసుకున్న సమాచారం మొత్తం తెలుసుకోవచ్చున్నారు. సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నెంబర్ 1967లో సంప్రదించవచ్చని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు.

తాజా పరిణామాలతో రేషన్ పంపిణీ వ్యవస్థ నూతన సాంకేతిక మార్పులతో అత్యంత పకడ్బందీగా అమలు జరుగుతుందని ఎమ్మెల్యే నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి, నియోజవర్గ స్థాయి, మండల స్థాయి నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యా బాల మందిర్‌లో మదర్ థెరీసా 115వ జయంతి వేడుకలు





**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు 26:** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూల్‌లో మంగళవారం మదర్ థెరీసా 115వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా పంచాయతీ పరిధిలో గల మదర్ థెరీసా విగ్రహానికి సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, ఉపసర్పంచ్ విళ్ళ మారుతి ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.నిరుపేదల సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన మదర్ థెరీసా మానవతా సేవకు ప్రతీకగా నిలిచారని, "మానవసేవే మాధవసేవ" అన్న తత్వంతో ఎంతోమంది జీవితాల్లో ఆశాకిరణంగా నిలిచారని వారు పేర్కొన్నారు.తరువాత పాఠశాల 9వ, 10వ తరగతి విద్యార్థులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి ఉన్న సుమారు అరవై మంది రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, సుధాకర్, హుస్సేన్, ఆసుపత్రి హెడ్ నర్సు దేవి జనని, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## దాకోడు గిరిజన ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఐటీడీఏ పీవో. కట్ట సింహాచలం..



**అడ్డతీగల,పెన్ పవర్,ఆగస్ట్ 26:** అడ్డతీగల మండలం దాకోడు గిరిజన ఆశ్రమం పాఠశాలను రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా. సింహాచలం మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ ఆశ్రమ పాఠశాలలో ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది ,విద్యార్థులకు విద్యను ఏ విధంగా బోధిస్తున్నది ,ఏజెన్సీలో ప్రభుత్వ కాలేజీలు హైస్కూల్లో, పాఠశాలలో విద్యార్థులకు ఒకటికి రెండుసార్లు ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలని ,ప్రాజెక్ట్ ఆఫీసర్ కట్ట.సింహా చలం అన్నారు,అదేవిధంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆశ్రమ పాఠశాలల్లో మెనూ ఏ విధముగా అమలు చేయుచున్నారు అన్నది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు.

## సమయమంతుల %ు% మాతంశెట్టి అన్నదాన సత్రం లో వేద సభ ఘనంగా



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 26:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని సమయమంతుల %ు% మాతంశెట్టి వార్ల అన్నదాన సత్రంలో మంగళవారం వేద సభను ఘనంగా నిర్వహించారు. ఆశయములో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేదపండితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
పండితులు చతుర్వేదములు పఠించి, వేదాశీర్వచనాలతో కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో ముందుకు నడిపించారు. సత్రం ప్రాంగణమంతా మంత్రోచ్ఛారణలతో మారుమ్రోగింది.
ఈ కార్యక్రమంలో ఆలయ కార్యక్రమ అధికారి బి. వెంకటరమణమూర్తి, టిడిపి నాయకులు మెర్ల నాగేశ్వరరావు, ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

## వాడపల్లి దేవస్థానంలో అభివృద్ధి పనుల పరిశీలన ఆలయ ఉప కమిషనర్ ఎన్ఎస్ చక్రధర్ రావు.





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 26:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు మంగళవారం పరిశీలించారు. ఆయనతో పాటు డి.ఈ. ఉదయ్‌కుమార్, ముదునూరి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.ఆలయ ఉత్తర, దక్షిణ ద్వారాల విస్తరణ పనులు, క్యూ లైన్ల ఏర్పాట్లు, వకుళమాత అన్నదాన భవన నిర్మాణాన్ని అధికారులు సమీక్షించారు. ద్వారాల వెడల్పుతో భక్తులకు స్వామివారి దర్శనం మరింత త్వరగా, సులభంగా లభిస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.
వకుళమాత అన్నదాన భవనంలో భక్తుల కోసం నిత్య అన్నదానం సజావుగా సాగేందుకు బాయిలర్ల ఏర్పాటు వంటి సదుపాయాలపై చర్చించి, పనులను వేగవంతం చేయాలని సూచనలు ఇచ్చారు.సమస్త ప్రాంతమంతా భక్తిపారవశ్య వాతావరణంలో మారుమ్రోగగా, అభివృద్ధి పనులు పూర్తి అయిన తరువాత వాడపల్లి క్షేత్రం మరింత ఆధ్యాత్మిక కాంతితో భక్తులను ఆకర్షిస్తుందని అధికారులు నమ్మకం వ్యక్తం చేశారు.

## గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు ఆహ్వానం

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 26:** జగ్గంపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగిలి ఉన్న 5వ తరగతి ఎస్సీ, ఎస్టీల సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జివి లలిత కుమారి తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉన్నదని అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

# ప్రజల్లో టైఫాయిడ్ టీకా అవగాహన కల్పించేందుకు సిబ్బంది నియామకం



- సూపర్వైజర్లు,మండల కోఆర్డినేటర్లు,ఫీల్డ్ ఆఫీసర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**కూనవరం,పెన్ పవర్, ఆగస్టు 26.**వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆమోదం పొందిన భారత్ బయోటెక్ కంపెనీ ద్వారా సురక్ష పబ్లిక్ హెల్త్ కౌన్సిల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న టైఫాయిడ్ వ్యాక్సినేషన్ అవేర్నెస్ ప్రోగ్రాంలో రంపచోడవరం,చింతూరు డివిజన్లోని 11 మండలాలలో పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సొసైటీ అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ ఎం. ప్రసన్నకుమారి తెలిపారు.ఓ ప్రకటనలో ఆమె మాట్లాడుతూ కాలంతో సంబంధం లేకుండా పెరుగుతున్న సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా, టైఫాయిడ్,డెంగ్యూ వంటి విష జ్వరాల పై ప్రజల్లో అవగాహన పెంపొందించే విధంగా,సురక్ష పబ్లిక్ హెల్త్ కౌన్సిల్ సొసైటీ ఆధ్వర్యంలో టైఫాయిడ్ టీకా అవగాహన కార్యక్రమంలో పనిచేసేందుకు 11 మండలాలకు ఇద్దరు సూపర్వైజర్లు,11 మంది మండల కోఆర్డినేటర్లు,వీరి కింద పని చేసేందుకు 4 గురు (3 అబ్బాయిలు,ఒక అమ్మాయి)ఫీల్డ్ ఆఫీసర్ల పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరడమైనదని ఆమె తెలిపారు.సూపర్వైజర్, మండల కోఆర్డినేటర్ పోస్టులకు అభ్యర్థులకు ఏదైనా డిగ్రీ ఉండాలని,ఫీల్డ్ ఆఫీసర్ పోస్టులకు మగ అభ్యర్థులకు ఇంటర్ మరియు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే ఆడ ఫీల్డ్ ఆఫీసర్ కు ఏఎన్ఎం,బీఎస్సీ నర్సింగ్, ఏఎన్ఎం,ఎం పి హెచ్ డబ్ల్యు లలో ఏదో ఒక కోర్సు చేసి ఉండాలన్నారు. సూపర్వైజర్లకు17 వేలు, మండల కోఆర్డినేటర్లకు 15 వేలతో పాటు ట్రావెల్ అలవెన్స్,ఫీల్డ్ ఆఫీసర్లకు 12వేలు,ట్రావెల్ అలవెన్సులు జీతంగా అందించబడతాయని ఆమె పేర్కొన్నారు.ఆసక్తి కలిగిన యువతి,యువకులు ఈనెల ఆగస్టు 29 వ తేదీన చింతపల్లి మండలంలోని చాడీపేట వీధిలో గల బ్రాంచ్ ఆఫీస్ నందు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని అన్నారు.వివరాలకు 8074249887 ఫోన్ నెంబర్ను సంప్రదించాలని సూచించారు. రంపచోడవరం,చింతూరు డివిజన్లోని 11 మండలాల నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## మట్టిగణపతినే పూజిద్దాం. పర్యావరణాన్ని కాపాడే యజ్ఞంలో భాగమవుదాం.



**మండపేట . పెన్ పవర్ .ఆగస్టు 26:**మట్టి గణపతి నే పూజించి పర్యావరణాన్ని కాపాడుకొందామని బిజెపి సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ పేర్కొన్నారు. చవితిమండపాలకు ఉచిత విద్యుత్తు ప్రకటించిన మంత్రి నారా లోకేష్ కు అభినందనలు తెలిపారు.తొలినాథుడు ఆది దేవుడైన వినాయకుడ్ని మట్టితో తయారుచేసి పూజించడంద్వారా సత్ఫలితాలు లాభిస్తాయని అన్నారు. ఆంక్షలు నెరవేరతాయని చెప్పారు. ప్రతిఒక్కరూ మట్టివిగ్రహాలనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.రంగురంగుల విగ్రహాలతో పర్యావరణానికి జరిగే నష్టాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. విదేశీ వస్తువులు వద్దు స్వదేశీ వస్తువులే ముద్దు అన్నారు. డిజెలు పెట్టి పెద్దపెద్ద శబ్దాలు పెట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా భక్తిపాటలతో సాంప్రదాయం కాపాడాలని కోరారు.బుర్రకథ,హరికథ వంటి కళలను ప్రోత్సహించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు.

# వినాయక చవితి సందడి.



### కేపీ రోడ్ రద్దీ.

**మండపేట . పెన్ పవర్ .ఆగస్టు 26:** గణపతి ఉత్సవాలకు అంతా సిద్ధ మైంది. అన్ని చోట్ల వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు వైభవం గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండపేట కేపీ రోడ్డు సందడి గా మారింది. కొనుగోలు దారులతో రద్దీ గా ఉంది. చిరు జల్లులు పడుతున్న ప్రజలు తమ పూజ కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేశారు.
చామంతి, గరిక,ఉత్తరేణి, ములక, ఉమ్మెత్త, తులసీ , మారేడు, మామిడాకులు కలిపి పత్రీ గా అమ్మారు. అరిటాకులు కట్టలు కట్టి విక్రయించారు. ప్లాస్టిక్ గొడుగులు, పాలవెల్లి, కొబ్బరి కాయలు, వివిధ రకాల పూలు, పండ్లు, వినాయక ప్రతిమలు విక్రయించారు. రెట్టు అధికంగా ఉన్నాయని వినియోగదారులు చెబుతుంటే ఈ ఏడాది ఆశించిన మేరకు వ్యాపారం లేదని వ్యాపారులు చెబుతున్నారు. మండపేట టాక్సీ స్టాండ్ వద్ద టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో 54 వ గణపతి నవ రాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాటిమీద, రావి చెట్టు సెంటర్, రథం సెంటర్, వాణీ మహల్ సెంటర్, బస్ స్టాండ్, రాజరత్న సెంటర్, పెదకాల్వ వద్ద చవితి పందిళ్ళ ఏర్పాట్లు చేస్తున్నారు.

## సేవకు మారుపేరు మదర్ థెరిస్సా



- వైసిపి నేత రమణారావు

**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 26 :**సేవకు మారుపేరు ప్రేమకు ప్రతిరూపంగా ప్రపంచాన్ని దయ కరుణతో నింపిన మదర్ థెరిస్సా ఆదర్శనీయమూర్తి అని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. అమలాపురం గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం మదర్ థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు.మదర్ థెరిస్సా చిత్రపటానికి రమణారావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.తన దేశం కాని భారతదేశంలో ఎంతోమంది అనాథలను అభాగ్యులను కుష్టు రోగులను తన సొంత కుటుంబీకులుగా భావించి అక్కున చేర్చుకుని సేవలందించిన మదర్ థెరిస్సా చరిత్రలో చిరస్మరణీయులుగా మిగిలిపోతారని రమణారావు కొనియాడారు.కార్యక్రమంలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, ఉప్పలగుప్తం వైసిపి ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్,పరమట రాజశేఖర్,వందిరి సుబ్బరాజు, నక్క సంపత్ కుమార్,నేరేడుమిల్లి శ్రీనివాసరావు,గంటా లక్ష్మీప్రసాద్, నేలపూడి సుగంధ కుమార్,కుంచే అర్జున్,పరమట రాజేష్ , విప్పర్తి రమేష్,గణేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మదర్ తెరిసా జన్మదిన వేడుకలు





**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 26:** విద్యానిధి పాఠశాలలో "మదర్ థెరిసా" జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె యొక్క గొప్పతనం గురించి విద్యానిధి విద్యాసంస్థల డైరెక్టర్ ఆకుల బాపన్న నాయుడు పిల్లలకు అనేక విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్యామల మహాలక్ష్మి, స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పడమర విప్పర్రు ప్రాథమిక సహకార సంఘం ప్రమాణ స్వీకారం



**పెంటపాడు, పెన్ పవర్ ఆగస్టు 26 :**పెంటపాడు మండలం పడమర విప్పర్రు ప్రాథమిక సహకార పరపతి సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు.
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ పసుపులేటి అమ్మిరాజు, సభ్యులు యడవల్లి లీలాకృష్ణ, శ్రీ బాయిశెట్టి వెంకట నారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఈతకోట తాతాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, పసల అచ్యుతం, కొండా తదితరులు పాల్గొన్నారు.
శతాబ్దం కాల చరిత్ర కలిగిన ఈ సంఘం రైతులకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించి అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆకాంక్షించారు. దేశాభివృద్ధిలో రైతుల పాత్ర అత్యంత కీలకమని, వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్రాలలో ఎన్డీఏ ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట. పెన్ పవర్ .ఆగస్టు 26:**వినాయక చవితి పర్వదినం సందర్భంగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గారు మండపేట నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.గణనాథుని ఆశీస్సులతో అందరికీ ఆయురారోగ్యాలు, సకల సంపదలు, విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. ఆ విఘ్నేశ్వరుడి దయతో అన్ని విఘ్నాలు తొలగిపోవాలని, ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు నెలకొని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే వేగుళ్ళ కోరారు.

## తాడేపల్లిగూడెంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# మదర్ తెరిసా జయంతి వేడుకలు





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ ఆగస్టు 26 :** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్‌లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో మదర్ తెరిసా జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ ప్రాంగణంలో మదర్ తెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
తదనంతరం హాస్పిటల్‌లోని రోగులకు పి ఎం జె ఎఫ్ లయన్ మదన్మోహన్ అగర్వాల్ గారి ఆర్థిక సహకారంతో పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన స్టాఫ్ నర్సులు జి. శ్రీదేవి, జి. శ్యామల కుమారి, ఏ. రమాదేవి లకు బహుమతులు ప్రదానం చేశారు.
అలాగే గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిపాల్ గారిని దుస్తులతో ఘనంగా సత్కరించారు. అనంతరం నర్సులచే మదర్ తెరిసా జయంతి కేక్ కట్ చేయించి సిబ్బందికి పంపిణీ చేశారు.
కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు చిన్నమ్మ మణీంద్ర, సెక్రటరీ ఎల్ఐసి త్రిమూర్తి, రీజనల్ చైర్‌పర్సన్ సుంకర శ్రీనివాస్, పి ఎం జె ఎఫ్ లయన్ మదన్మోహన్ అగర్వాల్, లయన్ బాపయ్య శర్మ తదితరులు మాట్లాడారు.
ఈ సందర్భంగా ఆర్ఎంఓ డాక్టర్ పీటర్, లయన్ పేరూరు కాశయ్య మదర్ తెరిసా విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. కార్యక్రమంలో లయన్ సన్నిధి సూర్యనారాయణమూర్తి, లయన్ వంగపండు రామ్మోహన్‌రావు, లయన్ జగదీష్, లయన్ జీడిగుంట హరిబాబు, లయన్ అలపాటి పవన్‌కుమార్, ఫార్మసీ ఇన్‌చార్జ్ రాము, హాస్పిటల్ వైద్యులు పాల్గొన్నారు.

## నిట్-ఆంధ్రప్రదేశ్, నామ్ టెక్ మధ్య అవగాహన ఒప్పందం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ ఆగస్టు 26 :** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) మంగళవారం నిప్పన్ స్టీల్ ఇండియా (గుజరాత్) కు చెందిన నామ్ టెక్ ( న్యూ ఏజ్ మేకర్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ) తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.
నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి. రమణారావు, నామ్ టెక్ ప్రోగ్రామ్ డైరెక్టర్ (ఆటో కో ఇ ) డాక్టర్ కే.సి. వోర ఒకరికొకరు ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు.
ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమణారావు మాట్లాడుతూ
"స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, మొబిలిటీ, రోబోటిక్స్, స్పేస్ అండ్ డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధ వంటి రంగాల్లో పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందం ఎంతగానో దోహదం చేస్తుంది. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా మిషన్‌లను బలోపేతం చేయడంలో ఇది ఒక ముందడుగు" అని తెలిపారు.
అలాగే పాఠ్య ప్రణాళికలో ఇన్నోవేషన్లు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కరికులం రూపకల్పన, స్టార్టప్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, మెంటరింగ్, హ్యాకథాన్‌లు నిర్వహణలో ఈ ఒప్పందం ఉపకరిస్తుందని అన్నారు. విద్యార్థులు నామ్ టెక్ ఫెలోషిప్‌లు పొందే అవకాశం కూడా ఉంటుందని వివరించారు. ఇప్పటివరకు నిట్ మొత్తం 35 అవగాహన ఒప్పందాలు చేసుకున్నదని ఆయన వెల్లడించారు.
ఈ కార్యక్రమాన్ని డీన్ (రిసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ) డాక్టర్ జి. రవికిరణ్ శాస్త్రి, అసోసియేట్ డీన్ డాక్టర్ వినోత్ కుమార్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు.
కార్యక్రమంలో నామ్ టెక్ ప్రోగ్రామ్ డైరెక్టర్ (స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్) డాక్టర్ వాసు వెలగపూడి, అసోసియేట్ డైరెక్టర్ (అకడమిక్స్) డాక్టర్ అమిత్ పటేల్, నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి. దినేష్ శంకర్ రెడ్డి, డీన్‌లు డాక్టర్ వి. సందీప్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ వీరేశ్ కుమార్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, అసోసియేట్ డీన్‌లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## మండపాలు వద్ద డీజేలు వద్దు డి.ఎస్.పి





**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 26 :** గణేష్ మండపాలు పందేళ్లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు తప్పనిసరి అని పోలవరం డిఎస్పి ఎం వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ లో సబ్ డివిజన్ పరిధిలో నెలవారి నేరాలపై సమీక్ష, గణేష్ ఉత్సవాల కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు తగ్గించి వాటిని అదుపులో ఉంచాలని సూచించారు. డిజె సౌండ్ కి అనుమతులు లేవని అన్నారు. గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని అన్నారు. రాత్రి పది గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు జరపరాదని, అశ్లీల నృత్యాలు అనుమతించబడమని అన్నారు. ఇతర మతాల ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు చూసుకోవాలి అని అన్నారు. సాంస్కృతి కార్యక్రమాలకు ముందుగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. నిమజ్జన రూట్ మ్యాప్, తేదీ ,సమయం ముందుగానే అనుమతి పొందాలని అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిలుగుమిల్లి, పోలవరం, కుకునూరు, సిఐలు బి వెంకటేశ్వరరావు, పి.బాల సురేష్ బాబు, రమేష్ బాబు, జీలుగుమిల్లి ఎస్ఐ వి క్రాంతి కుమార్, డివిజన్లో ఎస్ఐలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మట్టి ప్రతిమలను వాడండి- పర్యావరణాన్ని రక్షించండి: లయన్ డాక్టర్ అనసూరి.







**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 26:** గణేష్ ఉత్సవాలకు ప్రతిమలను వాడండి-పర్యావరణాన్ని పరిరక్షించండి అని ఏలేశ్వరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, వివిధ రసాయనాలతో రంగులద్దిన ప్రతిమలను చాలామంది వినియోగిస్తున్నారు. దీంతో పర్యావరణ పరిరక్షణకు తూట్లు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సమాజంలో మార్పు కోరుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ఏలేశ్వరం లయన్స్ క్లబ్ ఆఫ్ బననా ల్యాండ్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా 200 గణనాథుని ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాల పేరిట శబ్ద కాలుష్యం, జల కాలుష్యం, వాయు కాలుష్యాలు పెరిగిపోతున్నాయని దీనివలన పర్యావరణానికి తూట్లు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మునుముందు తరాలకు మనం ఏదైనా ఇవ్వగలము అంటే ప్రకృతిని రక్షించడమే వాళ్లకిచ్చే విలువైన బహుమతి అన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధానికి సంఘ సభ్యులు తమ వంతు కృషి చేయాలని, మట్టి ప్రతిమలతో పాటు ప్రకృతిలో లభించే వస్తువులతోటే పూజించేలా భక్తులకు ప్రోత్సాహం ఇవ్వాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయక ప్రతిమలను,విగ్రహాలను ప్రతి ఒక్కరూ పూజించాలని,సమాజ హితం కోసం తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి గొల్లజీరావు,వూర రాజబాబు,కప్పల నాగభూషణం,జ్యోతుల శ్రీనివాస్, గ్రంధి శ్రీనివాస్,తండూరి రాము , లయన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెంలో కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఘన సత్కారం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ ఆగస్టు 26 :** తాడేపల్లిగూడెం పట్టణంలో మంగళవారం వాతావరణం పండుగ వాతావరణాన్ని తలపించింది. తాడేపల్లిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్‌లకు ఘన సత్కారం జరిగింది.
ఈ సందర్భంగా చాంబర్ సభ్యులు ఇద్దరు ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి, పూలమాలలతో ఘనంగా ఆహ్వానించారు. పట్టణాభివృద్ధి, వ్యాపార వర్గాల సమస్యల పరిష్కారం, పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాలపై చాంబర్ ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.
కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతు
"వ్యాపారవేత్తలు, చిన్నతరహా పరిశ్రమలు ఆర్థికాభివృద్ధికి వెన్నెముకల వంటివి. కేంద్ర ప్రభుత్వం వ్యాపార వర్గాల ప్రగతికి కట్టుబడి ఉంది. ముఖ్యంగా ఏం ఎస్ ఎం ఇ. రంగానికి మద్దతు ఇవ్వడానికి అనేక పథకాలు అమలు చేస్తోంది" అని పేర్కొన్నారు.
ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ
"తాడేపల్లిగూడెం అభివృద్ధికి చాంబర్ ఆఫ్ కామర్స్ వంతు సహకారం విశేషం. పట్టణంలో వ్యాపార వర్గాల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సహకరిస్తుంది" అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఈతకోట తాతాజీ, టిడిపి నాయకుడు గోరిలా శ్రీధర్, ఇతర ప్రజా ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పాల్గొని నాయకులను ఘనంగా సత్కరించారు.
తాడేపల్లిగూడెం అభివృద్ధి దిశగా ప్రజాప్రతినిధులు, వ్యాపారవర్గాలు కలిసికట్టుగా పని చేస్తే ప్రాంతానికి మరింత మేలంటూ సభలో పలువురు అభిప్రాయపడ్డారు.?

## టిడిపి పార్టీ బలోపేతానికి విస్తృత స్థాయి సమావేశం





**కోరుకొండ, సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు 26:** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలంలోని బూరుగుపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నాడు రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజానగరం టిడిపి ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి పార్థసారథి తో పాటు ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, పత్తిపాటి పుల్లారావు, ముక్క ఉగ్ర నరసింహ రెడ్డి, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ బూరుగుపల్లి శేషారావు, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు,పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ ఇటీవల అమలు చేసిన స్త్రీ శక్తికి అపూర్వ ఆదరణ లభించిందన్నారు. అనుబంధం విభాగాల్లో చురుగ్గా పనిచేసేందుకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు ముందుకు రావాలన్నారు. అదేవిధంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు రాబోయే ఎన్నికలకు సంబంధించిన దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కార్యకర్తలు మండలాల్లో తమ గ్రామాల్లో సమన్యాయంతో పనిచేసి పార్టీ విజయానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ముఖ్య నాయకులు భారీగా తరలివచ్చారు.

## నేమం గ్రామం సారా రహితం




**కాకినాడ రూరల్, ఆగస్టు 26 పెన్ పవర్:** కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం నేమం గ్రామాన్ని సారా రహిత గ్రామంగా మంగళవారం ప్రకటించారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె. రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ బి.ఎన్.ఎస్. వరహాలు, హెడ్ కానిస్టేబుల్ కె. కంకా రావు, గ్రామ సర్పంచ్ రామదేవపు సూర్యప్రకాశ్ రావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.వి.ఎల్.దేవి, వీఆర్వో పి. సత్యనారాయణ తదితరులు పాల్గొని గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన "నవోదయం 2.0" పథకం పై అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు కల్పించి, నాటుసారాయిని పూర్తిగా నిర్మూలించినట్లు తెలిపారు. ఈ క్రమంలో నేమం గ్రామాన్ని అధికారికంగా "సారా రహిత గ్రామం"గా ప్రకటించినట్లు ఎక్సైజ్ సీఐ కె. రామ్మోహన్ రావు వెల్లడించారు.

## గోవింద గిరి వెంకటేశ్వరుని ఆదాయం 8.8 లక్షలు





**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 26:**అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం తిరుమల తిరుపతి దేవస్థానముల గోవిందగిరి శ్రీవేంకటేశ్వర దివ్య క్షేత్రంలో (పరకామణి సేవ) హుండీ లెక్కింపు టి.టి.డి ఉన్నతాధికారి జిమేధార్ చిన్నవేంకటేశులు పర్యవేక్షించగా, ఆలయ అధికారులు నారాయణరాజు, రూపుసాయి ఆధ్వర్యంలో సిబ్బంది, శ్రీవారి సేవకులు హుండీ లెక్కించారు. 9నెలల్లో వచ్చిన హుండీ ఆదాయం 8,88,000 ఎనిమిది లక్షల ఎనభై యెనిమిది వేల రూపాయలు వచ్చిందని ఆలయ అధికారులుప్రకటించారు . ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

## కూటమి అధికారం - వైసిపి వైఫల్యం వల్లనే



**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 26.**గత ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను మరిచినందుకే ప్రతిపక్షానికే పరిమితం చేశారని టిడిపి సీనియర్ నాయకులు చెలికాని ఉమా అన్నారు.జనసేన పార్టీ వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు,కూనవరం గ్రామ శాఖ అధ్యక్షులు హెచ్ రవి మాట్లాడుతూ వరద ముంపుకు గురైన వారిని పరామర్శించడానికి వచ్చిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారని అన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఏడాది పాలనలోనే అభివృద్ధిలో దూసుకుపోతుంటే చూసి వార్చలేక పోతున్నారని అన్నారు.గత వైసిపి ప్రభుత్వంలో ముంపు మండలాల ప్రజలకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి మరిచిన ప్రభుత్వం మీదని అన్నారు. సాక్షాత్తు ఆ పార్టీ అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి విఆర్ పురం మండలంలో పర్యటించి 1.15 లక్ష తీసుకున్న ప్రతి ఎకరానికి 3.85 లక్షలు ఇస్తానన్న హామీని మరిచారు,కాబట్టే ప్రతి పక్షానికే పరిమితమయ్యారని అన్నారు.రంపచోడవరం నియోజకవర్గం లో ఎమ్మెల్యే శిరీష తన సొంత డబ్బులతో కారుని అంబులెన్స్ గా మార్చిన ఘనత మా ఎమ్మెల్యేకి చెందుతుందని, అనారోగ్యంతో 11 మండలాలలో చనిపోయిన మృతదేహాలను తన సొంత అంబులెన్స్ ద్వారా 144 మందిని వారి వారి ఇళ్లకు చేర్చిన ఘనత ఆమెకే చెందుతుందని తెలిపారు. గతంలో కూనవరం పంచాయతీ ఉదయ భాస్కర కాలనీ వారి ఇంటి నష్టపరిహారం పోలవరం లిస్టులో లేకుండా వైసిపి ప్రభుత్వం చేసిందని,కూటమి అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఉదయ భాస్కర కాలనీ వాసులకి ఇంటి వాల్యూషన్ అమౌంట్ తో పాటు వారికి సొంత ఇల్లు కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

ఇక నుంచైనా తప్పుడు ప్రచారాలు అనుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎండి షరీఫ్,గుత్తుల బుజ్జిబాబు,మచ్చ శివకృష్ణ,కారం రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ప్రతిమలు పంపిణీ







**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 26:** నల్లా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెండి, బంగారు వర్తక సంఘం షరాబులు వినాయక పందిరి లో నల్లా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నల్లా పవన్ కుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోనం సత్తిబాబు, వాకర్స్ క్లబ్ ఏవీపీ గోకరకొండ నాగేంద్ర చేతుల మీదుగా మట్టి వినాయక ప్రతిమలను పంచిపెట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనాలు,రంగులతో తయారుచేసిన వినాయక విగ్రహాలను కాలువల నీటిలో కలపడం వలన నీరు కలుషితం అవుతుందని అందువలన మట్టి వినాయకుడిని పూజించాలని తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అరిగెల నాని, మేడిచర్ల త్రిమూర్తులు, వలవల శివరావు, నూకల సత్యనారాయణ,పేరి లక్ష్మీ నరసింహం, నాగ నవీన్, పెదమళ్ళ మణికంఠ, నల్లా దుర్గారావు, గోకరకొండ గంగన్న స్వామి, పాల్గొన్నారు.

# మత్స్యకారులు ఎక్కడైన వేట చేసుకునే అవకాశం కల్పించాలి





జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 26:** మత్స్యకారుల సమస్యలపై మత్స్యకార ప్రతినిధులు మత్స్య శాఖల అధికారుల తో కూలంకశంగా పూర్తిగా చర్చించి మరో 10 రోజుల్లో అందరికీ ఆమోదయోగ్యంగా సముద్ర తీర ప్రాంతంలో చేపల వేట పరిమితులను నిర్ణయించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ఉప్పాడ కొత్తపల్లి మత్స్యకారుల సముద్రపు వేట సమస్యలను విన్నవించేందుకు పిఠాపురం మాజీ శాసన సభ్యులు వర్మ నేతృత్వంలోని మత్స్యకార సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ని కలిసి సమస్యలను వివరించారు.ఉప్పాడ కొత్తపల్లి మత్స్యకారులు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఎక్కడయినా స్వేచ్ఛగా వేట చేసుకునే అవకాశం కలిపించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కి మాజీ శాసనస భ్యులు వర్మ వినతి పత్రాన్ని సమర్పించారు. యు. కొత్తపల్లి మండలంలో మత్స్య కారులు సము ద్రంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా ఎక్కడయినా స్వేచ్ఛగా చేపల వేట చేసు కొనే హక్కు ఉందని వర్మ తెలిపారు. గతంలో 2014 -19 చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉన్నపుడు నర్సాపురం దగ్గర అంతర్వది,బీమవరం వద్ద గొల్లపాలెం వైజాగ్ ,ఈ ప్రాంతాలలో వేటకు అభ్యంతరాలు కలిగి నప్పుడు అక్కడ జిల్లా కలెక్టర్, ఎస్.పి.లకు చెప్పి ఈ ప్రాంతాలలో వేట చేసుకునే అవకాశం కల్పించారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాకు వేట చేసుకునే అవకాశం ఈ ప్రాంతాలలో లేదనీ,దయచేసి మీరు అధికారులకు తెలియజేసి ఈ ప్రాంతాలలో మత్స్యకారులు వేట కొనసాగించే విధంగా అవకాశం కల్పించాలని వర్మ జిల్లా కలెక్టర్ వారిని సవినయంగా కోరారు.ఈ అంశాలపై చర్చలు నిర్వహించిన పిదప జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ సముద్రంపై చేపల వేట పరిమితిని నిర్దేశం చేందుకు మరొకసారి మత్స్యకార ప్రతినిధులు మత్స్య శాఖ అధికారులతో చర్చించి మరో పది రోజుల లో అందరికీ ఆమోదయోగ్యంగా సముద్ర%శీ% పై చేపల వేట పరిమితులను నిర్ధారించడం జరుగుతుందని, మాజీ శాసనస భ్యులు వర్మకు మత్స్యకార ప్రతినిధులకు సూచించారు.

## స్థిరంగా ఏలేరు జలాలు. పెరగని ఇన్ ఫ్లోస్.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 26:** ఏలేరు జలాశయం లో ఏలేరు జలాలు స్థిరంగా ఉన్నాయి. చెప్పుకోదగ్గ ఇన్ఫ్లోస్ ఏలేరు జలాశయానికి రాకపోవడంతో గత నాలుగు రోజులుగా మంగళవారానికి నికర జలాలు స్థిరంగానే ఉన్నాయి. ఏలేరు ప్రాజెక్ట్ అధికారులు అందించిన వివరాలు ప్రకారం, 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టిఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లో 80.01 మీటర్ల స్థాయిలో 13.47 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నాయి. కాగా ఏలేరు రిజర్వాయర్ లోకి 1409 క్యూసెక్కుల జలాలు ఇన్ఫ్లోస్ గా వస్తున్నాయి. విశాఖపట్నం వాతావరణ కేంద్రం ఇచ్చిన సమాచారం మేరకు భారీ వర్షాలు ఉండవచ్చనే ఉద్దేశంతో అధికారులు 1700 క్యూసెక్కుల ఏలేరు జలాలను అవుట్ ఫ్లోస్ గా విడుదల చేస్తున్నారు.

## డొక్కా సీతమ్మ కాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 26:** స్థానిక పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. మంగళవారం ఈ కార్యక్రమానికి తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే డొక్కా సీతమ్మను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదర్శంగా తీసుకుంటే ఆయన్ను తమ నేత తుమ్మలపల్లి రమేష్ స్ఫూర్తిగా తీసుకుని తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారని, సేవా కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాకినాడలో రెడ్ క్రాస్ క్యాన్సర్ బ్లాక్ త్వరలో ప్రారంభం







-% కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ,ఆగస్టు 26 పెన్ పవర్:**కాకినాడలో అత్యాధునిక క్యాన్సర్ వైద్యాన్ని అందించేందుకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో త్వరలో క్యాన్సర్ బ్లాక్ నిర్మాణం ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా శాఖ అధ్యక్షులు షణ్మోహన్ సగిలి వెల్లడించారు.మంగళవారం కలెక్టరేట్లో జరిగిన రెడ్ క్రాస్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడు తూ,శతవార్షికోత్సవాల వేళ ప్రారంభమవుతున్న ఈ క్యాన్సర్ బ్లాక్ రెడ్ క్రాస్ సమాజానికి అందించే సేవలకు తలమానికమవు తుందని తెలిపారు. కాకినాడ రెడ్ క్రాస్ సేవలలోనూ, నిర్వహణలోనూ రాష్ట్రంలో అగ్రగామిగా నిలుస్తోందని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో వై.డి. రామారావును జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్గా తిరిగి ఎన్నుకోగా, ఎన్. సుగుణ వైస్ చైర్మన్గా, ఎన్.వి.వి.ఆర్.కె. ప్రసాద్ బాబు కోశాధికారిగా ఎన్నికయ్యారు. అలాగే జి. శివరామకృష్ణ, బాదం బాలకృష్ణ, ఎస్.వి.ఎం. చంద్రశేఖర్, పైడా భావన ప్రసాద్,ఆకెళ్ళ శాస్త్రి, ఎన్. భానుమతి,ముంజులూరు విశ్వేశ్వ రరావు, సి.హెచ్. విజయ ప్రకాష్ తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం కలెక్టర్ వారితో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కోశాధికారి పి. రామచంద్ర రాజు మాట్లాడుతూ, కాకినాడ జిల్లా శాఖ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని, చైర్మన్ వై.డి. రామారావు నాయకత్వంలో రాష్ట్ర శాఖ కూడా దేశంలో అగ్రగామి అవుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ వై.డి. రామారావు ప్రవేశపెట్టిన నివేదిక, ఆడిట్ నివేదిక, ఇతర అంశాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆయన మాట్లాడుతూ శతవార్షికోత్సవాలు, క్యాన్సర్ బ్లాక్ నిర్మాణం విజయవంతంగా పూర్తి చేస్తామన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, సభ్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి కార్యక్రమంలో రెడ్ క్రాస్ సేవలకు విశేషంగా సహకరించిన దాతలు, అధికారులు, సభ్యులకు కలెక్టర్ షణ్మోహన్ బంగారు పతకాలు ప్రధానం చేశారు. డిఆర్ఓ జె. వెంకట్రావు, జడ్పీ సీఈవో వి. లక్ష్మణరావు, సిపిఓ పి. త్రినాథ్, డ్వామా పిడి ఏ. వెంకటలక్ష్మి లు పతకాలు అందుకున్నారు.అలాగే రక్తదాన కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొన్న ప్రభుత్వ శాఖల్లో వ్యవసాయ శాఖ జెడి విజయ్కుమార్, పిఠాపురం ఎంపీడీవో ప్రత్తిపాడు తహసిల్దార్లకు జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కె. శివకుమార్ వందన సమర్పణ చేశారు. రెడ్ క్రాస్ సభ్యులు విశేషంగా పాల్గొన్నారు.







# గాయత్రి వెంకటేశ్వరరావుని పరామర్శించిన గంటా కృష్ణ

**తాళ్ళపూడి, పెన్ పవర్, ఆగస్ట్ 26:**జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి గాయత్రి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో రాజమండ్రి కిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ తాళ్ళపూడి మండల అధ్యక్షులు గంటా కృష్ణ రాజమండ్రిలోని హాస్పిటల్లో పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎల్లప్పుడూ మీకు, మీ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకి ఫోన్ కిలిపి గాయత్రి వెంకటేశ్వరరావుకి ఇచ్చారు. గాయత్రి వెంకటేశ్వరరావుని ఎమ్మెల్యే పరామర్శించి, ధైర్యం చెప్పి, ఆరోగ్యం జాగ్రత్త అన్నారు. ఈ కార్యక్రమంలో మురమళ్ల సత్తిరాజు, గాయత్రి వెంకటేశ్వరరావు పిఏ జ్యోతి రమణి, కుటుంబ సభ్యులు ఉన్నారు.



# వైయస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన ముద్రగడ గిరిబాబు.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 25:**రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలో ప్రతిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి మాజీ మంత్రి,రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ముద్రగడ త్వరగా కోలుకుని ప్రజా క్షేత్రంలో పార్టీకి సేవలు అందించాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గ్రామాల్లో బలోపేతం చేసే విధంగా కష్టపడి పని చేయాలని జగన్ గిరిబాబుకు సూచించారు. గిరిబాబు మాట్లాడుతూ తన తండ్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకోవడమే కాకుండా, మా కుటుంబం పట్ల శ్రద్ధ చూపడం పట్ల గిరిబాబు ఈ సందర్భంగా మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఆయన వెంట జిల్లా సమాచార చట్టం అధ్యక్షులు గౌతు స్వామి పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చే మట్టి విగ్రహాల పంపిణీ





**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 26:** గణపతి నవరాత్రులు ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 27వ తేదీ వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కలెక్టరేట్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషా%శీ%తి డిఆర్ఓ కే మాధవి, ఏవో కే కాశీ విశ్వేశ్వరరావు,తదితరులకు పంపిణీ చేశారు. పర్యావరణ హితంగా గణపతి నవరాత్రి ఉత్స వాలను నిర్వహించు కునేందుకు ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను వినియోగించి. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## గణపతి ఉత్సవాలకు ఉచిత విద్యుత్

- **జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**

**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 26:** గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేటప్పుడు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల అందరికీ క్షేమంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు..కోనసీమ జిల్లా పరిధిలో వినాయక చవితి పండుగ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు,మండప నిర్వాహకులు భక్తులు జాగ్రత్త భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అన్నిచోట్ల మట్టితో తయారుచేసిన విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని ఆదేశించారు. విగ్రహాలు మండ పాలు ఏర్పాటు విషయంలో అన్ని రకాల సుందరీకరణ పనులు మట్టితోనే నిర్వహించడం తోపాటు వైరింగ్ లైటింగ్ పనులను కేవలం లైసెన్స్ ఉన్న ఎలక్ట్రిషియన్ల ద్వారా మాత్రమే చేపట్టాలని సూచించారు. విద్యుత్ స్థంబాలు లేదా పై లైన్ల నుండి అనధికారికంగా విద్యుత్ కనెక్షన్ల ను తీసుకొనరాదని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గణపతి నవరాత్రి ఉత్సవాలకు విద్యుత్ బిల్లులతో ప్రమేయం లేకుండా ఉచితంగా అందించాలని ఆదేశించిందన్నారు. శోభా యాత్ర నిమజ్జనం టైములో మార్గాలను ముందుగా ప్లాన్ చేసి, ఎలక్ట్రిక్ వైర్లు తగలని విధ%శీ%గా ఏర్పాట్లు ఉండాలన్నారు. విగ్రహాల నిమజ్జనం ఊరేగింపు శోభాయాత్ర మార్గాలలో విగ్రహాల రవాణా ఊరేగింపు నిమజ్జనం విషయంలో విద్యుత్ పంపిణీ సంస్థ సిబ్బంది సహాయం పొందాలన్నారు.పందిరిని ఏర్పాటు చేసేటప్పుడు,అగ్ని ప్రమాదాలు జరగకుండా, సురక్షితమైన ప్రదేశాన్ని ఎంచుకో వాలన్నారు. వైర్లు లూజ్‌గా లేకుండా, ఓవర్లోడ్ అవ్వ కుండా చూసుకోవాలన్నారు.గణపతి ముందు దీపాలు లేదా కర్పూరం వెలిగించేటప్పుడు, అవి పందిరికి లేదా ఇతర మండే వస్తువులకు దూరంగా ఉండేలా మెలకువలు పాటించాలన్నారు. పందిరి వద్ద ఒక అగ్నిమాపక పరికరం అందుబాటులో ఉంచు కోవడంతోపాటు ఇసుక బకెట్లు కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు.పర్యావరణ పరిరక్షణ కొరకు మట్టి విగ్రహాలు మాత్రమే విని యోగించాలని, రసాయన రంగులు వాడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా, సహజ రంగులు కలిగిన మట్టి విగ్రహాలను వాడటం వల్ల జల కాలుష్యం తగ్గుతుందన్నారు. పూజ తర్వాత మిగిలిపోయిన పూలు ఆకులు వంటి వాటిని నదులలో కాకుండా, ఒక కంపోస్ట్ గుంటలో వేయడం లేదా చెత్త బుట్టలో వేయడం మంచిదన్నారు.ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని, విగ్రహాలను నది , చెరువులలో కాకుండా, ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ప్రత్యేక తొట్టెల్లో నిమజ్జనం చేయడం పర్యావరణానికి మంచిదన్నారు.జనసందోహం నిర్వహణ, భక్తులు సులభంగా దర్శనం చేసుకునేలా క్యూ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు.భక్తులను నియంత్రించడానికి, దొంగతనాలను నివారించడానికి కొంతమంది వాలంటీర్లను నియమించాలన్నారు. ఆరోగ్య భద్రతకై ప్రాథ మిక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు .అత్యవసర పరిస్థితులలో వాడే ఫోన్ నంబర్లు పోలీస్, ఫైర్ స్టేషన్, అంబు లెన్సులు నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శబ్ద వాయు కాలుష్యం తగ్గించడా నికి, స్థానిక నిబంధనలకు అనుగుణంగా సౌండ్ పరిమితులను పాటించాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత పెద్దగా మైకులు వినియోగించకుండా చూడాలన్నారు.విగ్రహాన్ని రోడ్డుకు అడ్డంగా పెట్టకుండా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.ఆరోగ్యం పరిశుభ్రత పందిరి వద్ద దాని చుట్టూ పరిశుభ్రత ఉండేలా చూడాలన్నారు.ప్లాస్టిక్ కప్పులు, పేపర్లు వంటి వ్యర్థాలను చెత్తబుట్ట లోచెత్త బుట్టలో వేయాలన్నారు. ప్రసాదాలు,పంచుతున్నట్లయితే,అవి పరిశుభ్రమైన వాతావరణం లో తయారు చేశారని,ప్యాక్ చేశారని నిర్ధారించు కోవాల న్నారు.ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా గణపతి నవరాత్రి ఉత్సవాలు మరింత భక్తితో, సురక్షితంగా పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు.

## ఏపీ నైపుణ్యం పోర్టల్ ఆవిష్కరణ

**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 26 :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్,డిగ్రీ విద్యార్థిని విద్యార్థులకు ఇండియాస్ స్కిల్ కాంపిటీషన్స్ 2025 సంబంధించి 63 స్కిల్ ట్రేడ్స్ లో నిర్వహించడం జరుగుతుందని, దానికి సంబంధించి ఏపీ నైపుణ్యం పోర్టల్ లో ఆగస్ట్ 30 లోగా ఆసక్తి ఉన్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, కలెక్టర్,జిల్లా మేజిస్ట్రేట్ రావిరాల మహేష్ కుమార్ తెలియజేశారు.దీనికి సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా నైపుణ్యాబి అధికారి హరి శేషు తెలియజేశారు,ఈ కార్యక్రమం లో డి ఎస్ డి ఓ నాగబాబు,పీవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గడియార స్తంభం వద్ద మట్టి విగ్రహాలు పంపిణీ

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 26:** నియోజకవర్గం జానీ భాష సేవాసమితి ధన సహాయంతో అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద వినాయక మట్టి విగ్రహాలు ను అమలాపురం రూరల్ మండలం జనసేన పార్టీ అధ్యక్షులు లింగోలు పండు , చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు, కొప్పుల నాగ మానస చేతుల మీదుగా మంగళవారం 500 వినాయకుని మట్టి విగ్రహాలు పంచిపెట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ కమిటీ సభ్యులు ఘట్టం వీరు ,బండారు సురేష్,పోలిశెట్టి పవన్ మహేష్ , గోకరకొండ భాస్కర్ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించాలి




**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 26:** వినాయక చతుర్థి పురస్కరించుకుని మట్టి వినాయకుని పూజించాలి పర్యావరణాన్ని రక్షించాలి అనే నినాదంతో జగ్గంపేట, జె.కొత్తూరు హ్యాపీ చిల్డ్రన్స్ స్కూల్ విద్యార్థులు మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జె.కొత్తూరు, రాజపూడి, సీతారామపురం, బలభద్రపురం, బూరుగుపూడి, రామవరం, మర్రిపాక, గుర్రపాలెం, గొల్లగుంట గ్రామాలలో సుమారుగా 800 మట్టి వినాయక ప్రతిమలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలను ఉపయోగించవద్దని వేడుకున్నారు.

## నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

**మండపేట. పెన్ పవర్. ఆగస్టు 26:** వినాయక చవితి పర్వదినం సందర్భంగా రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, మండపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ అన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల కష్టాలను తొలగించి ప్రతి ఇంటా వెలుగులు నింపాలన్నారు. మండపేట నియోజకవర్గ ప్రజలందరూ ఐకమత్యంతో, ఆనందోత్సాహాలతో వినాయకుడిని పూజించి స్వామి వారి అనుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే ఉత్సవాల్లో పాల్గొని ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## గణేశ్ మండపాలను సందర్శించిన డీఎస్పీ రఘువీర్

**మండపేట. పెన్ పవర్ .ఆగస్టు 26:**వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ ఆకాంక్షించారు. రేపటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మండపాల కమిటీ సభ్యులకు పలు సూచనలు చేసేందుకు ఆయన ఇప్పనపాడులోని గణేశ్ మండపాలను పరిశీలించారు. మండపాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకున్నా కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. తొమ్మిది రోజుల పాటు అప్రమత్తంగా ఉండి, ఉత్సవాలను ప్రశాంతంగా ముగించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యుత్ లైటింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, లౌడ్‌స్పీకర్లు చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించకుండా వాడాలని సూచించారు. మండపాల వద్ద అశ్లీల నృత్యాలు లేదా అసభ్య కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తి శ్రద్ధలతో గణపతి ఆరాధన చేస్తే గణపయ్య కృపాకటాక్షాలు లభిస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట రూరల్ సీఐ పీ దొరరాజు, ఎస్సై కిషోర్ ఉన్నారు.



## పిసా చట్టంపై అవగాహన కార్యక్రమం





**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 26 :** పీసా చట్టంపై మంగళవారం ఎర్రం రెడ్డిపాలెం, దాలిపాడు పంచాయతీలలో గిరిజనులకు,పీసా సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వై రామవరం ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

ఆంధ్ర రాష్ట్రంలో మొత్తం 19 ఆదర్శ పంచాయతీలను ఎంపిక చేయగా అందులో వై.రామవరం మండలంలో ఎర్రం రెడ్డిపాలెం, దాలిపాడు పంచాయతీలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఏడు మండలాలలో మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ కూడా ఉందని తెలిపారు. పిసా చట్టంపై ఐటిడిఏ లీగల్ కన్సల్టెంట్ పల్లా త్రినాథ్ రావు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పంచాయతీలకు సంబంధించి సర్పంచులు, వీసా వైస్ ప్రెసిడెంట్లు, పిసా సెక్రటరీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, సచివాలయం సిబ్బంది,మండల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు అని తెలిపారు.

## గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

### మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట. పెన్ పవర్ .ఆగస్టు 26:**వినాయకచవితి పండుగను ప్రజలంతా ఘనంగా ఆనందంగా జరుపుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మండపేట ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఆర్.టి.జి శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్టు వెల్లడించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ కు ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి - సిఐ నాయక్







**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్ట్ 26 :**వినాయక చవితి ఉత్సవాలను భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని దేవరపల్లి సిఐ నాగేశ్వర్ నాయక్ అన్నారు.వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ కమిటీ సభ్యులతో మంగళవారం పోలీసు శాఖ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.గోపాలపురం ఎస్సై మనోహర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిఐ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు.అనంతరం ఎస్సై మనోహర్ మాట్లాడుతూ నవరాత్రులు ముగిసేలోగా నిమజ్జనం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఉత్సవాలను పురస్కరించుకుని ఎటువంటి సమస్యలు ఎదురైనా పోలీసులు రంగ ప్రవేశం చేసి సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు.అలాగే దేవరపల్లి మండలంలో ఎస్సై సుబ్రహ్మణ్యం అధ్వర్యంలో సైతం సమావేశం నిర్వహించారు.

# గంజాయి అమ్మకంతో కొన్న ఆస్తి సీజ్

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 26 :** గంజాయిని అమ్మి దాని ద్వారా వచ్చిన సొమ్ముతో కొన్న ఆస్తిని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వనపర్తి బాపిరాజు అనే వ్యక్తి ఇతరుల నుంచి గంజాయి కొని అక్రమంగా వ్యాపారం చేస్తుండడంపై అతన్ని పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. అయితే బాపిరాజు గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించిన డబ్బుతో గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో 0.84 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడన్నారు. అతనిపై కేసు నమోదు కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతను కొన్న భూమిని మంగళవారం సీజ్ చేయడం జరిగిందని వివరించారు. గంజాయి రవాణా చేసిన అమ్మకాలు చేపట్టిన ఈ విధంగా ఆస్తులు సీజ్ చేయడం జరుగుతుందని సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ హెచ్చరించారు.

# జగ్గంపేటలో భారీ అన్న సమారాధన



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 26**: శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని జగ్గంపేటలో కాకినాడ రోడ్ లో ఉన్న కృష్ణుడి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. సంఘం గౌరవ అధ్యక్షులు వైబోగుల కొండబాబు యాదవ్ మాట్లాడుతూ సుమారు 1500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజులపాటు ఘనంగా కృష్ణాష్టమి ఉత్సవాలు నిర్వహించామన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జగన్నాధపురం విద్యార్థినిలు




**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 26 :**ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి బాల బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని జగన్నాధపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ఎస్ఎస్ కుమారి తెలిపారు.నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో జరిగిన సెలెక్షన్ పోటీల్లో పాఠశాల విద్యార్థినిలు కరిష్మ,వరలక్ష్మి,అలేఖ్య అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు.ఆ కారణంగా వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.ఈనెల 29,30,31 వ తేదీల్లో ప్రకాశం జిల్లా చేకూరు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీళ్లు పాల్గొననున్నారన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పీడి చంద్రశేఖర్, బాలసుబ్రమణ్యం లను ఉపాధ్యాయులు,గ్రామస్తులు అభినందించారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం-రాంబాబు



**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్ట్ 26 :**ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గోపాలపురం మండల స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు.మండలంలోని గోపవరం గ్రామంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యుల అధ్వర్యంలో మానవత సభ్యుల సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఎండపల్లి శేఖర్ బాబు కవిత దంపతులు ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచడం లేదన్నారు.ఆ కారణంగా ఎన్నో అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ మిత ఆహారాన్ని తీసుకుని శారీరక వ్యాయామం చేయాలన్నారు.సర్పంచ్ శేఖర్ బాబు మాట్లాడుతూ మానవత ఆధ్వర్యంలో గోపవరం వంటి మారుమూల గ్రామాల్లో ఆశ్రం వైద్యుల పర్యవేక్షణలో శిబిరం నిర్వహించడం ఆనందదాయకం అన్నారు.ఇటువంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో భాగంగా వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.గైనకాలజిస్ట్,చిన్న పిల్లల,చర్మ,నేత్ర వైద్యులు పాల్గొన్నారు.ఎక్స్రేస్,స్కానింగ్,ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి గెడా జోగేంద్ర ప్రసాద్,జుత్తుగ సూర్య చంద్రం,హేమంత్, కొయ్యే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వివాహిత మహిళ అదృశ్యం

**ఆత్రేయపురం,పెన్ పవర్ ఆగస్టు26 :**ర్యాలి గ్రామానికి చెందిన కొడిసే ఝాన్సీ అనే వివాహిత మహిళ ఆదివారం ఇంటి నుండి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం గ్రామ పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఎటువంటి సమాచారం లభించలేదు.

దాంతో మంగళవారం కుటుంబీకులు ఆత్రేయపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎస్. రాము ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు ప్రారంభించారు.

# మినర్వాలో వినాయక చవితి సంబరాలు






**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 26 :**మినర్వా ప్రాంగణం మంగళవారం భక్తి, ఆనందాలతో మార్మోగింది. వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు మట్టితో స్వయంగా గణపతి విగ్రహాలను రూపొందించి, వాటిని పూజించారు. ఈ సృజనాత్మక కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మాస్టర్ అనిరుద్ గణపతి మహిమలను, ఆయన జీవన బోధనలను విద్యార్థులకు వివరించారు. ఆయన మాటలతో ప్రాంగణం అంతా భక్తి వాతావరణంలో నిండిపోయింది. తర్వాత విద్యార్థులు సమూహంగా "గణపతి బప్పా మోరియా%ా% జై బోలో గణేష్ మహారాజ్ కీ జై" అంటూ నినాదాలు గుప్పించడంతో ఉత్సవ క్షణాలు మరింత ఉత్సాహభరితంగా మారాయి. హెచ్ఎం మహేశ్వరి, ఇంచార్జ్ లక్ష్మణ్ కుమార్, రాజీవ్ కుమార్, రవి తదితరులు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు.

# సెల్ఫోన్ కోసం.. స్నేహితుడే హత్య

## రాయితో తలపై మోది - ఇసుక గుట్టలో కప్పేసిన దారుణం





**కాకినాడ పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్/తాళ్లరేవు ,ఆగస్టు 26** :సెల్ఫోన్ వివాదం ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణకు దారి తీసి చివరికి హత్యగా మారింది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి అనంతరం కాకినాడ జిల్లా కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలపల్లి చెక్ పోస్ట్ మురళినగర్ వద్ద చోటుచేసుకుంది. పుదుచ్చేరి యానాం కాకివారి వీధికి చెందిన లిపాలెపు శ్రీనివాస్ అలియాస్ శ్రీను (45)లిను అతని స్నేహితుడు రాయితో తలపై మోది హత్య చేసి, సమీపంలోని ఇసుక గుట్టలో మృతదేహాన్ని కప్పిపుచ్చి పరారయ్యాడు.అయితే రాత్రి గస్తీ నిర్వహిస్తున్న యానాం ఎస్సై పునీత్ రాజ్, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు, క్రైమ్ టీం పోలీసులు అనుమానాస్పద దృశ్యం గమనించి వెంటనే కోరంగి ఎస్సై పి.సత్యనారా యణకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చేపల వేట ఆధారంగా జీవిస్తున్న ఈ ఇద్దరు స్నేహితుల మధ్య చిన్నపాటి తగాదాగా మొదలైన వివాదం క్షణికావేశంలో హత్యకు దారి తీసిందని పోలీసులు తెలిపారు.కేసు దర్యాప్తు కాకినాడ రూరల్ సీఐ డి. చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు.

# రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం





**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్ట్ 26 :** రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణ పరిధిలోని డి కన్వెన్షన్ హాల్లో మంగళవారం జరిగిన పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (రామస్వామి) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయరంగం అభివృద్ధికి మార్కెటింగ్ కమిటీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని రైతుల ఉత్పత్తులకు సరైన ధర సమర్థమైన మౌలిక వస్తువులు పారదర్శక విధానాల అమలు ఈ కమిటీల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. మార్కెట్ కమిటీని ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి నూతన పాలక మండలి చర్యలు తీసుకోవాలని, ఆదాయం పెంచుకోవడంతోపాటు చిన్న సన్నకారు రైతులకు మేలు జరిగే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నూతన కమిటీ చైర్ పర్సన్ గా నూనే మంగాలక్ష్మి, వైస్ చైర్మన్ గా ఎం. చంద్రశేఖర్, డైరెక్టర్లుగా చాగంటి వరలక్ష్మి, గోలి దేవి, గురజారపు దుర్గాభవాని, గుత్తుల సూర్యావతి, జలధాని సుబ్రహ్మణ్యం, రేలంగి వెంకట్రావు, కొమ్మిరెడ్డి వీర సత్యవేణి, సైనం సాల్మన్ రాజు, తలాటం నాగబాబు, చలికి దుర్గ, అమలదాసు ఏసుబాబు, గాదంశెట్టి. శ్రీనివాస్, యాళ్ళ వీరబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని కూటమి నాయకులు రాజా సూరిబాబురాజు, విత్తనాల వెంకటరమణ, మట్టే శ్రీనివాసరావు, వల్లూరి సూర్యప్రకాశరావు, పాలకుర్తి శ్రీనివాసాచార్యులు, పొలమరశెట్టి సత్తిబాబు, కంటే జగదీష్ మోహన్, బడుగు శ్రీకాంత్, సరోజ వాసు, ఏలేటి సుబ్బారావు, ఏలేటి సత్తిబాబు, మేడిది శ్రీనివాస్, అడపా గంగాధర్, బొడ్డు రుద్రరావు, చంద్రశేఖర్, చేవ సీతారామరాజు, రంగనాథం వెంకన్నబాబు, కొంగర వెంకట్రావు, తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సేవకు మారుపేరు మదర్ థెరిస్సా.

## వైసిపి నేత రమణారావు...

**అమలాపురంరూరల్.పెన్ పవర్, ఆగష్టు 26:** సేవకు మారుపేరు ప్రేమకు ప్రతిరూపంగా ప్రపంచాన్ని దయ కరుణతో నింపిన మదర్ థెరిస్సా ఆదర్శనీయమూర్తి అని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. అమలాపురం గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం మదర్ థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా చిత్రపటానికి రమణారావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.తన దేశం కాని భారతదేశంలో ఎంతోమంది అనాథలను అభాగ్యులను కుష్టు రోగులను తన సొంత కుటుంబీకులుగా భావించి అక్కున చేర్చుకుని సేవలందించిన మదర్ థెరిస్సా చరిత్రలో చిరస్మరణీయులుగా మిగిలిపోతారని రమణారావు కొనియాడారు. కార్యక్రమంలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, ఉప్పలగుప్తం వైసిపి ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, పరమట రాజశేఖర్,పందిరి సుబ్బరాజు, నక్క సంపత్ కుమార్,నేరేడుమిల్లి శ్రీనివాసరావు,గంటా లక్ష్మీప్రసాద్, నేలపూడి సుగంధ కుమార్,కుంచే అర్జున్,పరమట రాజేష్ , విప్పర్తి రమేష్,గణేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబు హయాంలో 13 డీఎస్సీలు - 1.80 లక్షల పోస్టుల భర్తీ

## టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల వెల్లడి




**కాకినాడ, ఆగస్టు 26 పెన్ పవర్:**మెగా డీఎస్సీతో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలిచిందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, యువతకు ఇచ్చిన హామీ మేరకు 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించామని తెలిపారు.తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న ప్రతిసారి ఉపాధ్యాయ నియామకా లకు క్రమం తప్పకుండా డీఎస్సీలు నిర్వహించామన్న ఆయన, గత పాలనలో చేపట్టిన నియామకాల గణాంకాలను వివరించారు. చంద్రబాబు 14 ఏళ్ల సీఎం పదవీకాలంలో మొత్తం 13 డీఎస్సీలు నిర్వహించి 1,80,208 పోస్టులను భర్తీ చేసి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు.వైసీపీ ప్రభుత్వం 24 కేసులు వేసి డీఎస్సీకి ఆటంకం కలిగించినా, వాటిని అధిగమించి ఉపాధ్యాయ నియామకాలు జరిపిన ఘనత మంత్రి లోకేష్‌కే దక్కుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు వయోపరిమితి సడలింపులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచిందని తెలిపారు.విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు స్టూడెంట్-టీచర్ నిష్పత్తి సరిపడేలా ఉపాధ్యాయ నియామకాలు జరగాలని నమ్మిన లోకేష్, విద్యారంగ ముఖచిత్రాన్ని మార్చగలిగారని నవీన్ అభిప్రాయపడ్డారు.గత పాలనలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించేందుకు ఆరు రకాల బదుల విధానం అమల్లో ఉండగా, కూటమి ప్రభుత్వం దానిని తొమ్మిది రకాల బదులుగా మార్చి సులభతరం చేసిందని చెప్పారు.చంద్ర బాబు పాలనలో మెగా డీఎస్సీ నిర్వహిస్తే, సీఎం జగన్ హయాంలో "దగా డీఎస్సీ" నిర్వహించారని విమర్శించారు. ఈ సమావేశంలో తూము కుమార్, అనుకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు గణపతి ఉత్సవాలు ...




- చదువుతో పాటు సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత అందరిది ...
- విద్యార్థుల్లో భక్తిభావం పెంపొందేలా చర్యలు
- వినాయక చవితిపై అవగాహన
- శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ

**ఎటపాక పెన్ పవర్ ఆగస్టు 26:** పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో భక్తి భావం పెంపొందేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ అన్నారు. ఎటపాక మండలం తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ ఆవరణంలో మంగళవారం ముందస్తు వినాయక చవితి వేడుకలు సందడిగా జరిగాయి. ఇందులో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో పాఠశాలకు హాజరయ్యారు. నందిగామ, గన్నవరం, తోటపల్లి, సీతాపురం, మురుమూరు, కాపుగోంపల్లి, నెల్లిపాక, చోడవరం, రాయనపేట గ్రామాల నుంచి విద్యార్థులు మట్టితో చేసిన చిన్న చిన్న గణపతి విగ్రహాలను తీసుకొచ్చారు. పాఠశాలలోని ఒక తరగతి గదిలో అన్ని విగ్రహాలను పెట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్, రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ పాఠశాలలో అన్నీ పండుగలు నిర్వహిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. భావి తరాలు బావు%శీ%డాలంటే పిల్లలకు క్రమ శిక్షణ నేర్పించాలన్నారు. విద్యార్థులకు భక్తిభావం అలవాటు చేయాలని తద్వారా దురలవాట్లకు దూరం అవుతారన్నారు. చదువుతో పాటు సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సత్యమల్లికా, నాగజ్యోతి, ఖాసీం, శ్రీను, అప్పాజీ, ప్రసన్న, జ్యోత్స్న, సంధ్య, నమ్రత, వరలక్ష్మి, నాగేంద్రమ్మ, రమాదేవి, ఇమాన్సి, దివ్య, వెంకటలక్ష్మి, శివదేవి, శివాని, వాసవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# భర్తపై పెట్రోలు పోసి నిప్పంటించిన భార్య

**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 26:**రావులపాలెం మండలం గోపాలపురం గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. భర్తపై పెట్రోల్ వేసిన కావాల్సిన భార్య. భర్త ప్రతిరోజూ మద్యం త్రాగి వేధింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన చెందిన భార్య, అతడిపై పెట్రోలు పోసి నిప్పంటించింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గోపాలపురం గ్రామానికి చెందిన మట్టా ఏంజలీనా జెన్నీఫర్ థామస్ తన భర్త మట్టా శ్రీనివాస్ (40) తరచూ మద్యానికి బానిసై కుటుంబంలో కలహాలు సృష్టిస్తుండడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో ఆగస్టు 25వ తేదీ రాత్రి సుమారు 3 గంటల సమయంలో నిద్రిస్తున్న శ్రీనివాస్‌పై ఆమె వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటించింది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఈ ఘటనపై రావులపాలెం ఎస్సై కె.వి. రమణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

# కాజులూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



మండల వ్యవసాయ అధికారి పర్యటన

**కాజులూరు,ఆగస్టు 26 ,పెన్ పవర్:**మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి క్వాలిటీ కంట్రోల్ ఇన్స్పెక్టర్ వి.డి.శంకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి, కొనుగోలు విధానాన్ని సమీక్షించారు.కాజులూరు పిఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సుమారు 10 వేల క్వింటాళ్ల ధాన్యం ఇప్పటివరకు కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ధాన్యం సేకరణలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా పిఏసీఎస్ అధ్యక్షుడు కొంగల వీరరాజు, ఉపాధ్యక్షుడు తాటినేని రామారావు, డైరెక్టర్ శ్రీరామరాజు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రైతులు సకాలంలో ధాన్యం తేవాలని, మద్దతు ధర (ఎం ఎస్ పి) కంటే తక్కువకు విక్రయించవద్దని మండల వ్యవసాయ అధికారి శంకరరావు రైతులకు సూచించారు. ప్రభుత్వం రైతుల పక్షాన ఉన్నదని, ఎటువంటి అన్యాయం జరగనీయమని ఆయన హామీ ఇచ్చారు.



# క్రైస్తవులు సమాజానికి మాదిరిగా ఉండాలి...



- సందడిగా చర్చి వార్షికోత్సవం...
- పాస్టర్ చార్లెస్ పి.జాకబ్

**ఎటపాక,పెన్ పవర్,ఆగస్టు 26 :**క్రైస్తవులు సమాజానికి మాదిరిగా జీవించాలని, తద్వారా శాంతి స్థాపన జరుగుతుందని విజయవాడ ఫిలదేల్ఫియా ఎ.జి చర్చి పాస్టర్ చార్లెస్ పి జాకబ్ అన్నారు. ఎటపాక మండలం మేడువాయి యేసుక్రీస్తు సీయోను మినిస్ట్రీస్ 24వ వార్షికోత్సవ వేడుకలు పాస్టర్ నవీన్ లాజరస్, హెప్సీబా లాజరస్ ఆధ్వర్యంలో మంగళవారం సందడిగా జరిగాయి. ఈ వేడుకల్లో అతిథిగా చార్లెస్ పి జాకబ్ పాల్గొని ప్రసంగించారు. యేసు జీవితం స్ఫూర్తి దాయకమన్నారు. ఆయన్ను విశ్వసించే వాళ్ళు సత్ప్రవర్తన, నీతి కలిగిన జీవితం కనపరచాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు . కార్యక్రమంలో ప్రమీలరాణి, విజయరావు, తిమోతి, ఒనేసిము, రవి, గిద్యోను, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ తరలి వెళ్ళిన ఏలేశ్వరం బీజేపీ కార్యకర్తలు.

## పైల బోస్ వర్గంలో పెల్లుబికిన నూతన ఉత్సాహం.







**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 26:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సారధ్యంలో కాకినాడలో నిర్వహించే యాత్రకు ఏలేశ్వరం పట్టణ బిజెపి శ్రేణులు మంగళవారం భారీ ఎత్తున తరలి వెళ్లాయి. స్థానిక బిజెపి కార్యాలయం నుండి పైల సుభాష్ చంద్ర బోస్ ఆధ్వర్యంలో 300 మందికి పైగా కార్యకర్తలు ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్ర మంలో ప్రత్యేక ఆకర్షణగా బోస్ ఏర్పాటు చేసిన ఆదివాసీ సంప్రదాయ కొమ్ముల నృత్యం ప్రదర్శన అందర్నీ అలరించింది. ఈ నృత్యం ద్వారా సాంస్కృతిక వైభవం ప్రతిబింబించగా, కార్యక్రమానికి ప్రత్యేక రంగులు అద్దింది. పైల బోస్ ఫోటోలతో యువకులు ధరించిన ప్రత్యేక టీ షర్టులు అందరి చూపులను ఆకర్షించి యాత్రకు ప్రత్యేకతను సంతరించాయి. ఈ కార్యక్రమంలో పైలా అయ్యప్ప, నీలి సురేష్, చింతల పాండవులు, శిడగం కన్నారావు, పొట్నూరి అప్పారావు, కర్రోతు జానకిరామయ్య, కర్రోతు గణేష్, ముచ్చి అప్పలరాజు, సిరిపురపు సత్తిబాబు, పొన్నాడ సత్తిబాబు, వాగు రమేష్, కొల్లెపర సురేంద్ర , బోస్ వర్గం బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా ముదునూరి మురళీకృష్ణం రాజు

- సేవా కార్యక్రమాలతో దూసుకుపోతున్న ముదునూరి
- ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా





**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 26 :** ముదునూరి మురళీకృష్ణం రాజు పేరు వినగానే ప్రజలకు గుర్తుకొచ్చేది ఆయన సేవా దృక్పథం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే ధైర్యం. రాజకీయ నాయకుడిగానే కాకుండా ఒక సామాజిక సేవకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఒమ్మంగి గ్రామ పర్యటనలోనూ ఆయన ఈ లక్షణాలనే ప్రతిబింబించారు. బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్న స్థానిక నాయకుడు ముమ్మిడి చక్రారావును ప్రత్యక్షంగా కలసి ఆరోగ్యాన్ని ఆరా తీశారు. "మీ కుటుంబానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని హామీ ఇవ్వడం ద్వారా నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి ఆయన చూపుతున్న మానవతా దృక్పథం మరోసారి స్పష్టమైంది. అలాగే గ్రామ పెద్దలతో కరతాళ ధ్వనుల మధ్య మమేకమై, ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. మురళీరాజు ప్రజా సమస్యలు, ఆరోగ్య ఇబ్బందులు, విద్యా అవసరాలు వంటి అంశాల్లో ఎప్పుడూ ముందుండి స్పందిస్తున్నారు. ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు సహాయం, వైద్య సేవలందించడం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తోడ్పాటు అందించడం ఆయన దినచర్యలో భాగమైంది. ప్రజలతో కలిసిపోయే తీరుతో, నిరుపేదల పక్షాన నిలబడే స్వభావంతో, ముదునూరి మురళీకృష్ణం రాజు ప్రత్తిపాడు రాజకీయాల్లోనే కాకుండా ప్రజల హృదయాల్లోనూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.

# వాహన చోదకులకు పొంచి ఉన్న ప్రమాదం

తస్మాత్ జాగ్రత్త





**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 26 :** రెండు మండలాల సరిహద్దుల్లో ఉన్న పెద్దేరు వంతెన వద్ద వాహన చోదకులకు ప్రమాదం పొంచి ఉందని, తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని పలువురు కోరుకుంటున్నారు.

వివరాల్లోనికి వెళితే వై.రామవరం, అడ్డతీగల మండలాల సరిహద్దుల్లో ఉన్న పెద్దేరు వంతెన ఇరువైపులా ఉన్న రక్షణ గోడలపై పిచ్చి మొక్కలు, రావి, జువ్వి మొక్కలు మొలిచాయని పలువురు అంటున్నారు. ఈ మొక్కల వల్ల వంతెన శిథిలమయ్యే పరిస్థితులు ఉన్నాయని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వంతెన ఇరువైపులు ఉన్న రక్షణ గోడలు కనిపించేవని, ప్రస్తుతం పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో రక్షణ గోడలు కూడా కనిపించడం లేదని, దీనివల్ల వాహన చోదకులకు ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉన్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా జంగిల్ కటింగ్ చేసేవారని, ప్రస్తుతం ఈ శాఖ నిర్లిప్తంగా ఉండడంతో గత రెండు సంవత్సరాల నుండి జంగిల్ కటింగ్ చేసిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఏ ఆర్ రహదారి ఇరువైపులా ఉన్న జంగిల్ క్లియరెన్స్ చేసి,వాహనదారులకు ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుచున్నారు.

# కాకినాడ పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

మల్లాడి సత్యలింగ నాయకర్ విగ్రహానికి నివాళి



**కాకినాడ, ఆగస్టు 26 పెన్ పవర్:**కాకినాడ నగర పర్యటనలో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీ.వి.ఎన్. మాధవ్ మంగళవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆయనకు స్వాగతం పలికారు.తరువాత గాటీ సెంటర్ వద్ద విద్యాదాత స్వర్గీయ మల్లాడి సత్యలింగ నాయకర్ విగ్రహానికి పివిఎన్ మాధవ్, వనమాడి కొండబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే వాడండి - విద్యార్థుల ర్యాలీ






**కాజులూరు,ఆగస్టు 26 పెన్ పవర్:**వచ్చే వినాయక చవితి పర్వదినం సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే వాడాలని పిలుపునిచ్చారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆదేశాల మేరకు కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణు మూర్తి ఆధ్వర్యంలో, స్కౌట్ టీచర్ జి. బుజ్జిబాబు పర్యవేక్షణలో జరిగింది. విద్యార్థులు గ్రామం అంతా తిరిగి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే రంగు విగ్రహాల వాడకాన్ని నివారించి, సాంప్రదాయ రంగులు లేదా రంగుల్లేని మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగించాలని ప్రజలకు సందేశమిచ్చారు. మండల పరిషత్ కూడలి వద్ద విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేసి గ్రామస్థులను చైతన్యపరిచారు. ఈ ర్యాలీలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణమూర్తి, స్టాఫ్ సెక్రటరీ కె. హరినాథ్, కె. భాస్కర్ సత్యప్రసాద్, షేక్ వలీ భాషా, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసులో కూతుర్లు మేనల్లుడే ముద్దాయిలు



**అనకాపల్లి, పెన్ పవర్, ఆగస్టు 26:** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

సంచలనం కలిగించిన మహిళ హత్య కేసులో ప్రధాని నిందితులు కూతుర్లు మేనల్లుడుగా అనకాపల్లి పోలీసులు గుర్తించారు. రెండు వారాల క్రితం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం పాట జంగాలపాలెం గ్రామ సమీపం అటవీ ప్రాంతంలో సగం కాలిన, గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు వివిధ ప్రసారమధ్యల ద్వారా ప్రకటనలు ఇవ్వగా విశాఖపట్నం కూర్మాన్నపాలెం చెందిన వ్యక్తి గుర్తించి పోలీసులకు మహిళకు సంబంధించిన వివరాలను తెలిపారు. హత్యకు గురైన మహిళ గా గుర్తించారు ఆమె రాజీవ్ నగర్ కూర్మన్నపాలెం లో వంటరిగా నివాసం ఉంటుంది. ఈమె భర్త కత్తర్లో ఉద్యోగం చేస్తున్నాడు వీరిద్దరికీ చాలా కాలంగా విభేదాలు ఉన్నాయి. ఈమెకు ఇద్దరు కూతుర్లు పెద్దమ్మాయి జలంధర్ పంజాబ్ యూనివర్సిటీలో చదువుతుండగా చిన్నమ్మాయి అక్కయ్యపాలెం లోని ఒక ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతుంది. తల్లిని చూసేందుకు ఇంటికి వచ్చిన 15 ఏళ్ల కూతురు తల్లి సెల్ ఫోన్లో అసభ్యకర వీడియోలు ఆమె నగ్న ఫోటోలు చూసి నిలదీసింది. దీంతో వీరిద్దరికీ మధ్య గొడవ జరిగింది. ఇదే విషయాన్ని తన అక్కకు తెలపడంతో తల్లి ప్రవర్తన పై వీరిద్దరూ కోపం పెంచుకున్నారు. అప్పటికే మేనల్లుడు మురళీధర్ తో సంతు కి ఆస్తి వివాదాలు ఉన్నాయి. తల్లి ప్రవర్తన విషయమే అనూష ఆమె చెల్లెలు మురళీధర్ తో చర్చించారు. ఇదే అదునుగా భావించిన మురళీధర్ సంతు హత్యకు ఇద్దరు కూతుర్లను ఒప్పించాడు. దానికి ఇద్దరక్క చెల్లెలు ఓకే చేయడంతో సంతు హత్యకు ప్లాన్ సిద్ధం చేశారు. మురళీధర్ తన స్నేహితుడు కారును తీసుకొని నగర శివారులో ఉన్న పెట్రోల్ బంక్ లో ఐదు లీటర్ల పెట్రోల్ కొనుగోలు చేశాడు. సంతును హత్య చేసేందుకు మంచం పట్టిని సిద్ధం చేశారు. అనుకున్న ప్రకారం సంతు నిద్రిస్తుండగా ఆమె చాతి భాగంపై కూర్చుని మెడకు తవ్వాలతో బిగించుగా పెద్ద కూతురు అనూష అరవకుండా నోరు మూసింది చిన్న కూతురు సంతు చేతులతో ప్రతిఘటించకుండా ఆమె చేతులను పట్టుకొని సహాయం చేసింది. అనంతరం బెడ్ షీట్ తో సవాన్ని చుట్టి మంచం పట్టితో శవాన్ని కట్టి కారులోకి తరలించారు. అక్కడినుంచి సబ్బవరం మండలం భాడజంగాలపాలెం సమీపంలో అటవి ప్రాంతంలో ప్లాస్టిక్ బాటిల్ లో తెచ్చుకున్న పెట్రోల్ తో మృతదేహాన్ని తగలబెట్టారు. శవం తగలబడుతుంది అని నిర్ధారించుకున్న తర్వాత తిరిగి అదే కారులో ఇంటికి వచ్చారు. ఎటువంటి ఆధారాలు దొరక్కూడదనే ఉద్దేశంతో మురళీధర్ కారును శుభ్రం చేసి సెల్ఫోన్లోని సిమ్ములను ధ్వంసం చేశారు. పోలీసులు ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రకటనలు చేయడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు ఆమె వివరాలు తెలిపారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి అసలు విషయాన్ని రాబట్టారు. నిందితులను ఇద్దరినీ కోర్టు ఆదేశాలతో రిమాండ్ కు పంపగా మరొకరుని 15 సంవత్సరాలు వయసు ఉండడంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారు.

# హైడ్రో పవర్ ప్రాజెక్ట్ మాకు వద్దు...!





- **హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు నిలిపివేయాలి..**
- **పవర్ ప్రాజెక్టు కోసం నిర్వహించే గ్రామ సభను అడ్డుకుంటాం.**
- **ఆదివాసి గిరిజన సంఘం హెచ్చరిక.**

**పెన్ పవర్ హుకుంపేట ఆగస్టు 26** :హుకుంపేట మండలం భూర్జ,మజ్జివలస పంచాయతీ పరిధిలలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం అనుమతులను తక్షణమే విరమించుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బాధిత ప్రజలతో కలిసి స్థానిక రెవెన్యూ తహసిల్దార్ వారికి ప్రాజెక్టు వ్యతిరేక పత్రం. సమర్పించారు.

ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి క్రిష్ణరావు మాట్లాడుతూ ఆదివాసీల ప్రత్యేక హక్కులు చట్టాలను గంగలో కలిపే ప్రయత్నం చేస్తూ. షెడ్యూల్ ప్రాంత భూములను ప్రభుత్వం అదానికి కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ఇలాంటి చర్యలను. గిరిజన సంఘం చూస్తూ ఊరుకోదు అని హెచ్చరించారు.

బాధిత ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. అందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉందని అయన అన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ అనుమతులను నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు,ప్రభుత్వం రేపు అనగా ఆగస్టు 28న నిర్వహించే గ్రామసభను బాధిత ప్రజలు వెతిరేకిస్తున్నారని వారు తెలియజేశారు గ్రామసభను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ప్రాజెక్టు వ్యతిరేక పత్రం. అందజేసినట్టు ఈ సందర్భంగా పత్రిక విలేకరులకు. తెలియజేశారు. కార్యక్రమానికి ఎంపీటీసీ హరిబాబు, సర్పంచ్ పంగి మొత్తి వైస్ ప్రెసిడెంట్ సాంబే లక్ష్మీ కృష్ణంరాజు సురేష్ పరశురామ్ గిరిజన సంఘం నాయకులు కృష్ణమూర్తి మరియు బాధిత ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు .

# అనకాపల్లి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ కాసులు దండుకోవడంలో పక్కా ప్లానింగ్

- చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్న జీవీఎంసీ కమిషనర్






**అనకాపల్లి, పెన్ పవర్, ఆగస్టు 26 :**శవాల మీద పేలాలు ఏరుకుంటున్నట్లు అనకాపల్లి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై వచ్చే ఫిర్యాదులపై చాలా చక్కగా ప్లాన్ చేసి డబ్బులు గుంచుకుంటున్నారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు నేరుగా గాని లేదా పత్రికల్లో వచ్చిన వార్తలపై గాని ఏదైనా గాని కాదేది కవితకి అనర్హం అన్నట్టు ఫిర్యాదు వస్తే చాలు పిండం మీద కాకులు వాలినట్లు వాలి అక్రమ నిర్మాణదారుల దగ్గర కాకులు పడుచుకుతినట్లు తింటున్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలులే ఉదాహరణ దీనిని బహిర్గతం చేస్తూ అనకాపల్లి సిపిఐ జిల్లా కమిటీ నాయకులు బహిరంగంగానే ప్రెస్ మీట్ పెట్టి జీవీఎంసీ దందాపై ఏకకరువు పెట్టారు. అక్రమ కట్టడాల సంబంధించి వసూళ్లు దందా అంతా ఓకే అయితే పక్క బిల్డింగ్ ప్లాన్ ఉండి నిర్మాణం కోసం రోడ్డుపై వేసిన మెటీరియల్ తొలగించాలంటూ నానా హడావిడి చేసి డబ్బులు దోచుకుంటున్నా వైనాన్ని సిపిఐ నాయకులు బహిరంగంగానే ఎండగట్టారు. నాకేంటి సిగ్గు నలుగురు నవ్విపోదురు గాక అన్నట్టు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై ఎందరు ఎన్ని విమర్శలు చేసిన పై స్థాయి నుండి కింద స్థాయి వరకు అంతా సిగ్గు ఎగ్గు లేకుండా తందాలు కొనసాగిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులు సైతం బుట్ట దాఖలు చేస్తూ కలెక్టర్ ను తమ తప్పుడు నివేదికలతో బోల్తా కొట్టిస్తున్నారు. ఫిర్యాదుదారుడు తన సమస్య పరిష్కారం కాలేదని మొరపెట్టుకున్న మరోసారి నీ ఫిర్యాదుని రీ ఓపెన్ చేసుకొని వెటకారమైన సమాధానాలతో అవమానిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసిన స్పందన లేకపోవడంతో ఎవరికి మొర పెట్టుకోవాలో అర్థం కాని అయోమయ స్థితిలో ఫిర్యాదుదారుడు ఉన్నాడు. అనకాపల్లి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ కార్యాలయంకు వచ్చిన ప్రతి ఫిర్యాదు పై ఎలా డబ్బులు దండుకోవాలో అక్కడున్న టౌన్ ప్లానింగ్ అధికారికి వెన్నతో పెట్టిన విద్య ఇతని ఆగడాలకు జోనల్ కమిషనర్ సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. అందిన కాడికి కాసులన్నీ టౌన్ ప్లానింగ్ అధికారికి దోచుకుంటుంటే అడిగిన వారందరికీ తాను సమాధానం చెప్పాల్సి వస్తుందని తల పట్టుకుంటున్నాడు. టౌన్ ప్లానింగ్ విభాగంపై చర్యలు తీసుకోలేక అనకాపల్లి నుండి వెళ్లిపోవడానికి సైతం సిద్ధంగా ఉన్నారు. అనకాపల్లి టౌన్ ప్లానింగ్ పై ఉన్నత అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. బహిరంగంగానే సిపిఐ నాయకులు ఎన్నడూ లేని విధంగా టౌన్ ప్లానింగ్ అధికారుల ఆగడాలపై ధ్వజమెత్తరంటే ఈపాటికి ఇక్కడ పరిస్థితి అర్థమవుతుంది. ఉన్నతాధికారులు చర్యలు ఈ విభాగంపై శూన్యమని గ్రహించిన సిపిఐ నాయకులు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో ఎంక్వాయిరీ చేయించాలని డిమాండ్ చేస్తున్నారంటే ఇక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది.

# పద్మనాభం మండలంలో దివ్యాంగులకు ఉపకార పథకాల గుర్తింపు శిబిరం





**పద్మనాభం, పెన్ పవర్ ఆగస్టు 26 :**పద్మనాభం మండల ప్రజా పరిషత్ ప్రాంగణంలో ది ఎబిలిటీ పీపుల్ స్వచ్ఛంద సంస్థ, విశాఖపట్నం ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగుల కోసం గుర్తింపు అసెస్మెంట్ శిబిరం నిర్వహించారు.

మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల నుండి 80 మంది దివ్యాంగులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. వారిలో 30 మందిని ఉపకరణాల పంపిణీ కొరకు గుర్తించారు.

ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు కే. రాంబాబు, మండల అభివృద్ధి అధికారి యం. విజయ్ కుమార్, మండల వైద్య అధికారి లీల ప్రసాద్, మండల ప్రజా నాయకులు హాజరయ్యారు. అలాగే ది ఎబిలిటీ పీపుల్ సంస్థ ప్రతినిధి వంశీతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల భవనంపై కూలిన భారీ వృక్షం.





**తృటిలో తప్పిన పెను ప్రమాదం.**

**వర్షంలో భయాందోళనతో పరుగులు తీసిన విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు.**

**పెన్ పవర్ హుకుంపేట ఆగస్టు 26** అల్లూరు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆదర్శ. ప్రాథమిక పాఠశాలపై భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో దాదాపు 30 మంది విద్యార్థులు విద్యార్థులు మరియు ఐదు ఉపాధ్యాయులు భవనంలో వున్నారు దీంతో ప్రాణ భయంతో విద్యార్థులు ఉపాధ్యాయులు వర్షంలో పరుగులు తీశారు. ఈ భారీ వృక్షం పెను శబ్దంతో పాఠశాల భవనంపై పడడంతో. విద్యార్థిని విద్యార్థులు భయంతోలని గురయ్యారు కాగా ఎవరికి ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు

## 2011 వరల్డ్ కప్ ఫైనల్‌లో యువరాజ్ కంటే ముందుగా ధోనీ బ్యాటింగ్.. కారణాలు చెప్పిన సచిన్



**హైదరాబాద్ పెన్ పవర్:** 2011 ప్రపంచ కప్ ఫైనల్ అందరికీ గుర్తుండే ఉంటుంది. 2011, ఏప్రిల్ 2న వాంఖడే వేదికగా శ్రీలంకతో జరిగిన ఫైనల్ పోరులో ధోని సేన 6 వికెట్ల తేడాతో విజయం సాధించి రెండోసారి వన్డే ప్రపంచ కప్‌ను ముద్దాడింది. ఇండియన్ క్రికెట్ ఫ్యాన్స్ కు అది ఎప్పటికీ మర్చిపోలేని మ్యాచ్. ముఖ్యంగా ఈ మ్యాచ్ లో ధోని కొట్టిన విన్నింగ్ షాట్ ఇప్పటికీ అభిమానుల కళ్ల ముందు కదలాడుతూనే ఉంటుంది. టోర్నీ మొత్తం విఫలమైన ధోనీ ఫైనల్లో మాత్రం చెలరేగి ఆడాడు. జట్టు క్లిష్ట పరిస్థుల్లో ఉన్నప్పుడు వచ్చి మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో సగటు క్రికెట్ అభిమానికి ఒక ఆలోచన మైండ్ లో ఉంటూనే ఉంటుంది. 2011 లో టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ ను గమనిస్తే యువరాజ్ సింగ్ తర్వాత ధోనీ బ్యాటింగ్ కు దిగేవాడు. ఫైనల్ ముందు వరకు ఎలాంటి మార్పు జరగలేదు. అయితే ఫైనల్లో మాత్రం మూడో వికెట్ పడిన తర్వాత ఐదో స్థానంలో బ్యాటింగ్ కు రావాల్సిన యువరాజ్ స్థానంలో కెప్టెన్ ధోనీ బరిలోకి దిగాడు. అప్పటివరకు బ్యాటింగ్ లో ఫామ్ లో లేని ధోనీ.. యువీ కంటే ముందుగా రావడం చూసి స్టేడియంలో ఫ్యాన్స్ ఆశ్చర్యానికి గురయ్యారు. దీని వెనుక అసలు కారణం టీమిండియా దిగ్గజం సచిన్ చెప్పుకొచ్చాడు.

సచిన్ మాట్లాడుతూ యువరాజ్ కంటే ధోనీ ముందుగా రావడానికి రెండు కారణాలను వివరించాడు. " రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి లెఫ్ట్-రైట్ కాంబినేషన్. లంక జట్టులో ఇద్దరు ఆఫ్-స్పిన్నర్లు ఉండడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. అలాగే ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున మురళీధరన్ ఆడాడు. 2011 వరల్డ్ కప్ ముందువరకు మురళీ బౌలింగ్ ను నెట్స్ లో ధోనీ మూడు సీజన్ ల పాటు ఆడాడు". అని టెండూల్కర్ చెప్పుకొచ్చాడు. టీమిండియా స్కోర్ 114 పరుగుల వద్ద కోహ్లీ ఔటైనప్పుడు ధోనీ క్రీజ్ లోకి వచ్చాడు. గంభీర్ తో కలిసి 109 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి వరల్డ్ కప్ ను అందించాడు.

1983 తర్వాత భారత జట్టు గెలిచిన రెండో వన్డే ప్రపంచ కప్.. 2011. ఫైనల్‌లో శ్రీలంకను ఓడించి ధోని సేన 2011 వన్డే ప్రపంచకప్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మెన్ ఇన్ బ్లూ 48.2 ఓవర్లలో దానిని ఛేదించింది. గౌతమ్ గంభీర్ (97), ఎంఎస్ ధోని (91⁎) స్టార్ పెర్ఫార్మర్లు కాగా, విరాట్ కోహ్లి (35), యువరాజ్ సింగ్ (21⁎) భారత్ పరుగుల వేటలో సహకారం అందించారు.

## ఆసియా కప్‌లో భారత్‌పై రెండు మ్యాచులు మేమే గెలుస్తం: పాక్ బౌలర్ హారిస్ రవూఫ్






**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ ప్రారంభానికి ముందే భారత్, పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఇండియాను చిత్తుగా ఓడిస్తామంటూ పాక్ ఆటగాళ్లు, మాజీలు ప్రగల్భాలు పలుకుతున్నారు. తాజాగా పాక్ సీనియర్ బౌలర్ హారిస్ రవూఫ్ కూడా ఇవే తరహా వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్‌లో భారత్‌తో జరిగే రెండు మ్యాచులు మేమే గెలుస్తామని బీరాలు పలికాడు. ఆసియా కప్?లో భారత్, పాక్ మ్యాచ్ గురించి ఓ అభిమాని అడిగిన ప్రశ్నలకు రవూఫ్ బదులిస్తూ.. 'ఇండియాతో జరిగే రెండు మ్యాచ్‌లు మేమే గెలుస్తాం.. దేవుడి ఆశీర్వాదం మాపై ఉంది' అన్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా.. హారిస్ రవూఫ్ అతివిశ్వాసంపై నెటిజన్లు ట్రోల్స్ చేస్తున్నారు. "మీరు గెలిచేది లేదు.. సచ్చేది లేదు.. అన్ని ఉద్దేర మాటలే" అంటూ ఇండియన్ క్రికెట్ ఫ్యాన్స్ రవూఫ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తున్నారు. పాకిస్థాన్ ఆసియా కప్ జట్టులో హారిస్ రవూఫ్ ఎంపికైన విషయం తెలిసిందే. 2025, సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు దుబాయ్, అబుదాబి వేదికగా ఆసియా కప్-2025 జరగనుంది. ఈ సారి టీ20 ఫార్మాట్‌లో జరగనున్న ఈ కాంటినెంటల్ టోర్నీలో పాకిస్తాన్, ఇండియా, ఒమన్, యూఏఈ జట్లు గ్రూప్ ఏలో తలపడనున్నాయి. సెప్టెంబర్ 14న చిరకాల ప్రత్యర్థులు ఇండియా, పాకిస్థాన్ తలపడనున్నాయి. సమీకరణలన్నీ అనుకున్నట్లుగా జరిగితే సూపర్?4 స్టేజ్‌లో ఒకసారి, ఫైనల్ పోరులో మరోసారి ఇండియా, పాకిస్థాన్ జట్లు తలపడే అవకాశం ఉంది.

క్రికెట్‌లో ఇండియా, పాక్ మ్యాచ్?కు ఉండే క్రేజ్ వేరే. దాయాదుల పోరు కోసం ఇరుదేశాల క్రికెట్ ఫ్యాన్సే కాకుండా యావత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తారు. అయితే, ఆసియా కప్?లో భారత్ పాక్ ఆడనున్న మ్యాచ్?లపై సంధిగ్ధం నెలకొంది. ఇటీవల భారత్ పాకిస్థాన్ మధ్య చోటు చేసుకున్న సైనిక ఘర్షణల వల్ల పాక్ మ్యాచ్‌ను భారత్ ఈ మ్యాచును బైకాట్ చేసే అవకాశం ఉన్నట్లు క్రీడా వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే మాత్రం క్రికెట్ ప్రియులకు తీవ్ర నిరాశ అనే చెప్పవచ్చు.

**ఆసియా కప్ 2025 పాకిస్తాన్ జట్టు:** సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్ , ఫఖర్ జమాన్ , హారీస్ రవూఫ్, హసన్ అలీ , హసన్ నవాజ్, హుస్సేన్ తలత్, ఖుష్దిల్ షా, మహ్మద్ వహెర్జ్, మొహమ్మద్ వాహెర్జ్ (వికెట్, మొహమ్మద్ వాహెర్జ్), సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహీన్ షా అఫ్రిది, సుఫ్యాన్ మోకిమ్.

## ధోనీ కాదు.. ఇండియాలో అతడే నెంబర్ వన్ వికెట్ కీపర్: టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా క్రికెట్ చరిత్రలో బెస్ట్ వికెట్-కీపర్ అంటే ఎవరికైనా ఠక్కున మహేంద్ర సింగ్ ధోనీ చెప్పేస్తారు. రెండు దశాబ్దాలుగా వికెట్ కీపింగ్ పై ధోనీ వేసిన ముద్ర అలాంటిది. స్టంప్స్ వెనకాల కూల్ గా ఉంటూ ప్రత్యర్థులకు తన కీపింగ్ నైపుణ్యాలతో చెమటలు పట్టిస్తాడు. మహేంద్రుడు వికెట్ల వెనకాల ఉంటే క్రీజ్ ధాటి రావడానికి కూడా బ్యాటర్లు సందేహిస్తారు. ముఖ్యంగా స్టంపింగ్ లో ధోనీకి తిరుగులేదు. ఇప్పటివరకు ఎన్నో మెరుపు స్టంపింగ్ లతో క్రేజీ స్టంపింగ్స్ చేశాడు. అయితే టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్ మాత్రం ధోనీని పొగుడుతూనే టీమిండియా బెస్ట్ వికెట్ కీపర్ గా మరొకరిని ఎంచుకున్నాడు.

ఆర్. శ్రీధర్ ఎంఎస్ ధోని కంటే వృద్ధిమాన్ సాహా బెటర్ వికెట్ కీపర్ అని తన అభిప్రాయాన్ని తెలిపాడు. సాహా నైపుణ్యాలను ప్రశంసిస్తూ శ్రీధర్ ఇలా మాట్లాడాడు. "సాహా అద్భుతమైన వికెట్ కీపర్. వికెట్ కీపింగ్ చేసేటప్పుడు తన పట్టుదలను చూపిస్తాడు. గ్లోవ్స్ వేసుకుంటే తన ఆటిట్యూడ్ ఇంకోలా ఉంటుంది. జట్టు కోసం ఊహించని స్కిల్స్ తనలో బయటపెడతాడు. ఎక్కువగా మాట్లాడకపోయినా సాహా వికెట్ల వెనకాల ఉంటూ కెప్టెన్ కు కాన్ఫిడెన్స్ ఇస్తూ ఉంటాడు. ఎంఎస్ ధోని కంప్లీట్ ప్యాకేజీ. అతను అన్ని విభాగాల్లో కలిపి నెంబర్ వన్. కానీ వికెట్ కీపర్ విషయంలో మాత్రం వృద్ధిమాన్ సాహా అగ్రస్థానంలో ఉన్నాడు". అని శ్రీధర్ తెలిపాడు. 2010లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సాహా భారత జట్టు తరఫున 40 టెస్టులు, 9 వన్డేలు ఆడాడు. 11 ఏళ్ల సాహా టెస్ట్ కెరీర్‌లో 92 క్యాచ్‌లు, 12 స్టంపింగ్‌లు ఉన్నాయి. 2014లో ఎంఎస్ ధోని టెస్ట్ క్రికెట్ నుండి రిటైర్ అయ్యాక.. రిషబ్ పంత్ రాకముందే భారత టెస్ట్ జట్టుకు సాహానే దిక్కు. బ్యాటింగ్ కంటె కూడా ఎక్కువగా తన కీపింగ్ స్కిల్స్ తో ఆకట్టుకునేవాడు. ఎన్నో స్టన్నింగ్ క్యాచ్ లు, మెరుపు స్టంపింగ్స్ చేసి మ్యాచ్ లను మలుపు తిప్పిన రోజులు కూడా ఉన్నాయి. ఎన్నో విలువైన ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ, తగిన గుర్తింపు పొందలేకపోయాడు. 2021లో సాహా తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.

## రేర్ ప్లాన్ ను అమలు పరిచిన టాక్సిక్ టీమ్!



జాన్వీ కపూర్ ఫ్యాషన్ మీరు స్టార్లను చూస్తారు



అప్పటివరకు కేవలం కన్నడ ప్రేక్షకులకే పరిచయమైన యష్ లైఫ్ ను కెజిఎఫ్ సినిమా ఒక్కసారిగా మార్చేసింది. కెజిఎఫ్2 తర్వాత యష్ రాక్‌స్టార్ కూడా అయ్యారు. ఆ రెండు సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో సక్సెస్ తో పాటూ గుర్తింపును తెచ్చుకున్న యష్ తర్వాత ఏ సౌత్ స్టార్ డైరెక్టర్‌తోనో లేదా బాలీవుడ్ కమర్షియల్ డైరెక్టర్ తోనో సినిమా చేస్తారనుకున్నారు.

**లేడీ డైరెక్టర్‌తో యష్ మూవీ**

కానీ యష్ మాత్రం అందరినీ ఆశ్చర్యపరుస్తూ లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఓ సినిమాను అనౌన్స్ చేశారు. టాక్సిక్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా డ్రగ్స్ నేపథ్యంలో తెరకెక్కనుండగా, గీతూ ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా ఏకకాలంలో ఇంగ్లీష్ లో కూడా రూపొందుతుంది. టాక్సిక్ కోసం పలు హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా వర్క్ చేస్తున్నారు.

**45 రోజుల యాక్షన్ షెడ్యూల్**

శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం మేకర్స్ 45 రోజుల యాక్షన్ షెడ్యూల్ ను ప్లాన్ చేశారని తెలుస్తోంది. ఇది చాలా రేర్ గా జరుగుతూ ఉంటుంది. ఎప్పుడైనా సరే మేకర్స్ ఒకేసారి యాక్షన్ సీన్స్ ను తెరకెక్కించరు. బ్రేక్ తీసుకుంటూ పలు షెడ్యూల్స్ లో యాక్షన్ పార్ట్ ను పూర్తి చేస్తారు కానీ టాక్సిక్ టీమ్ మాత్రం ఈ 45 రోజుల షెడ్యూల్ లోనే కీలకమైన యాక్షన్ సీన్స్ షూటింగ్ ను చేయనున్నట్టు తెలుస్తోంది.

**హాలీవుడ్ స్టంట్‌మాస్టర్ నేతృత్వంలో..**

హాలీవుడ్ స్టంట్ మాస్టర్ జేజే పెర్రీ మరియు ఇంకొందరు ఈ షెడ్యూల్ ను మానిటరింగ్ చేస్తున్నారు. కాగా యష్ ఈ సినిమా కోసం చాలా కొత్త లుక్ లోకి మేకోవర్ అయ్యారు. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తవగా ఆ అవుట్‌పుట్‌తో మేకర్స్ హ్యాపీగా ఉన్నారు. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో నయనతార, తారా సుతారియా, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్, టోవినో థామస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.



ప్రతి లుక్‌ని ఎలా రాక్ చేయడం శ్రీముఖికి తెలుసు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com